RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

## ఇసుక అక్రమ రవాణాలో సిబిఐ విచారణ

### సోమిరెడ్డి ఆరోపణలపై కాకాణి గోవర్ధన్ రెడ్డి సవాల్

నెల్లూరు,అక్టోబర్5: ఇసుక అక్రమ రవాణాలో తనకు సంబంధం ఉందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చేస్తున్న ఆరోపణలపై సీబీఐ దర్యాప్తునకు సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సవాలు విసిరారు. తాను తప్పు చేసినట్లు నిరూపించే దమ్ము సోమిరెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. నెల్లూరులో మాజీ మంత్రి కాకాణి మీడియాతో మాట్లాడుతూ.. తాను చెప్పిన పనులు అధికారులు చేయడం లేదని ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉన్నారని అన్నారు. తాను చెప్పిన వారిని కేసుల్లో ఇరికించడం లేదని ఆయన బాధపడుతున్నారని ఆరోపించారు. సోమిరెడ్డి బతుకు అంతా అవినీతిమయమే అని విమర్శించారు. తనపై సోమిరెడ్డి చేస్తున్న ఆరోపణలు అన్నీ అవాస్తవమే అని చెప్పారు. కేసులు, అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దొంగ కేసులు పెట్టి ఇబ్బంది పెడితే మా ప్రభుత్వం వచ్చిన తర్వాత మంచంలో పడుకొని ఉన్నా లాక్కొస్తామని హెచ్చరించారు. నాపై చేస్తున్న అవినీతి ఆరోపణల్లో ఒక్కదానిని అయినా రుజువు చేయగలవా అని సోమిరెడ్డిని కాకాణి ప్రశ్నించారు.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

కర్నూలు సంపుటి : 04 సంచిక :146 ఆదివారం 06-10-2024 పేజీలు :04 వెల:రూ. 5.00

## కిసాన్ సమ్మాన్ నిధుల విడుదల

### 9.4కోట్ల రైతుల ఖాతాల్లో రూ.20వేలకోట్లు జమ
### మహారాష్ట్రలో ప్రారంభించిన ప్రధాని మోడీ



ముంబై,అక్టోబర్6 : ప్రధాని నరేంద్ర మోదీ కిసాన్ సమ్మాన్ నిధి విడుదల చేశారు. మహారాష్ట్ర పర్యటనలో భాగంగా వాశింలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నిధుల విడుదలను ప్రారంభించారు. 18వ విడుతలో 9.4కోట్ల మంది రైతుల ఖాతాల్లో దాదాపు రూ.20వేలకోట్లు జమ కానున్నాయి. ఈ సందర్భంగా నమో షెత్కారీ మహాసమ్మాన్ నిధి యోజన సైతం ప్రారంభించారు. దేశవ్యాప్తంగా రైతులకు కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.6వేల చొప్పున మూడు విడుతల్లో కిసాన్ సమ్మాన్ నిధిని నేరుగా రైతుల ఖాతాల్లో సమ చేస్తున్న విషయం తెలిసిందే. తొలి విడుతలో ఏప్రిల్ జూలై మధ్య.. రెండో విడుతలో ఆగస్టు- నవంబర్.. మూడో విడుతలో డిసెంబర్-మార్చి మధ్య కేంద్రం సాయాన్ని రైతులకు అందిస్తున్నది. ఇక ఇప్పటి వరకు రూ.3.45 లక్షల కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. కిసాన్ నిధులు సమ కాని రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని.. ఇందు కోసం అధికారిక వెబ్‌సైట్‌లో సంప్రదిం చాలని కేంద్ర సూచించింది. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, కేంద్రమంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, రాజీవ్ రంజన్ సింగ్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే,ఉప ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్, మంత్రి సంజయ్ రాథోడ్ పాల్గొన్నారు. వెబ్‌కాస్ట్ ద్వారా దేశ వ్యాప్తంగా 732 కృషి విజ్ఞాన కేంద్రాలు (కెవికెలు), 1 లక్షకు పైగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, 5 లక్షల కామన్ సర్వీస్ సెంటర్‌లతో సహా దాదాపు 2.5 కోట్ల మంది రైతులు ఈ కార్యక్రమంలో భాగస్వాము లయ్యారు. పీఎం కిసాన్ నిధుల విడుదల రోజును.. పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్‌గా జరుపుకుంటూ వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పథకం ద్వారా రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందించి.. తద్వారా వారి జీవనోపాధిని పెంచడానికి ప్రభుత్వం చేస్తోందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకాన్ని 24 ఫిబ్రవరి 2019న ప్రారంభించారు. ఈ పతకం కింద భూమి కలిగిన ప్రతి రైతుకు మూడు సమాన వాయిదాల చొప్పున సంవత్సరానికి రూ. 6,000 అందిస్తోంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకంలో భాగంగా ఇప్పటి వరకు 18 విడతలు నిధులు పంపిణీ చేయగా.. ఈ మొత్తం రూ. 3.45 లక్షల కోట్లు దాటిందని, దేశ వ్యాప్తంగా 11 కోట్ల మందికి పైగా రైతులు లబ్ది పొందారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## తిరుమలలో విఐపి సంస్కృతి తగ్గాలి



విఐపిల కోసం అనవసర హడావిడి చేయరాదు
ఆధ్యాత్మికత ఉట్టిపడేలా పరిసరాలు ఉండాలి
తిరుమల పవిత్రత పెంచి..నమ్మకం కలిగించాలి
ప్రశాంతతకు భంగం వాటిల్లకుండా చూసుకోవాలి
భవిష్యత్ నీటి అవసరాలకు తగ్గట్లుగా ప్రణాళికలు చేయాలి
కొండల్లో అటవీప్రాంత విస్తీరణం పెరిగేలా చేయండి
భక్తుల ఫిర్యాదులు, అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి
తిరుమల అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష

తిరుమల,అక్టోబర్5 : తిరుమలలో వీఐపీ సంస్కృతి తగ్గాలని సీఎం చంద్రబాబు టీటీడీని అదేశించారు. ప్రముఖులు వచ్చినప్పుడు హడావుడి కనిపించకూడదన్నారు. సింపుల్‌గా, ఆధ్యాత్మిక ఉట్టిపడే పరిసరాలు ఉండాలి తప్ప ఆర్భాటం, అనవసర వ్యయం వద్దని సూచించారు. తిరుమల పవిత్రత, నమ్మకం కాపాడేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని చంద్రబాబు హితవు పలికారు. తిరమలలోని పద్మావతి అతిథి గృహంలో టీటీడీ అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, టీటీడీ ఈవో శ్యామల రావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి సహా ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్షలో టీటీడీ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సూచనలు చేశారు. కొండపై గోవింద నామస్మరణ తప్ప మరో మాట వినిపించకూడదని గట్టిగా చెప్పారు. ప్రశాతంతకు ఎక్కడా భంగం కలగకూడదన్న చంద్రబాబు.. ఏ విషయంలో కూడా రాజీ పడొద్దని ఆదేశించారు. ఈ మధ్య కాలంలో జరిగిన రాజకీయ హడావుడిని దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు ఈ సూచన చేసినట్టు కనిపిస్తోంది. భవిష్యత్ నీటి అవసరాలకు తగ్గట్లు నీటి లభ్యత ఉండేలా చూసుకోవా లని తిరుమల తిరుపతి దేవస్థాన అధికారులను అప్రమత్తం చేశారు చంద్రబాబు. ముందస్తు ప్రణాళికకు సిద్ధం చేయాలన్నారు. అటవీ ప్రాంతాన్ని 72 నుంచి 80 శాతంపైగా పెంచాలని అధికారులకు సూచించారు అటవీ సంరక్షణతోపాటు అడవుల విస్తరణ కోసం వచ్చే 5 ఏళ్లకు ప్రణాళికు రూపొందించాలని అన్నారు. బయోడైవర్సిటీ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీటీడీ సేవలపై భక్తుల నుంచి స్పందన తీసుకునే విధానంపై సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. వచ్చిన ప్రతి భక్తుడు తమ అనుభవాలపై అభిప్రాయాలు చెప్పే అవకాశం కల్పించాలన్నారు. భక్తుల సూచనలు, సలహాల ఆధారంగా సేవలపై టీటీడీ పనిచేయాలని అప్‌డేట్ చేస్తూ ఉండాలని సూచించారు. ఒక్క టీటీడీలోనే కాకుండా అన్ని దేవాలయాల్లో భక్తుల అభిప్రాయాలు తీసుకునే విధానం తీసుకురావాలని మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డిని ఆదేశించారు. లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదం నాణ్యత పెరిగిందని భక్తులు చెబుతున్నారన్న చంద్రబాబు...ఎల్లప్పుడూఇది కొనసాగాలని ఆదేశించారు. మరింత మెరుగుపడేలా చూడాలన్నారు. ప్రసాదాల తయారీలో వాడే పదార్థాల నాణ్యత బాగుండేలా చూడాలన్నారు. అత్యుత్తమ పదార్థాలు మాత్రమే వాడాలని సూచించారు. టీటీడీ సిబ్బంది భక్తుల పట్ల గౌరవంగా వ్యవహరించాలన్న సీఎం... దేశ విదేశాల నుంచి వచ్చేవారు హ్యాపీగా వెళ్లేలా చూడాలన్నారు. దురుసు ప్రవర్తన అనేది ఎక్కడా ఉ ండకూడదని హెచ్చరించారు. భక్తులు సంతృప్తితో, అనుభూతితో కొండ నుంచి తిరిగి వెళ్లాలని హితవు పలికారు. తిరుమల పేరు తలిస్తే ఏడుకొండల వాడి వైభవం, ఆధ్యాత్మిక మాత్రమే చర్చకు రావాలన్నారు. స్విమ్స్ సేవలు కూడా మెరుగుపరచాలన్నారు.ఇదొక ప్రత్యేకమైన క్షేత్రమని... తిరుమల పవిత్రత కాపాడడం, ఆధ్యాత్మిక విషయంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరిం చాలన్నారు. ఈ సమీక్ష అనంతరం తిరుమలలో వకుళమాత సెంట్రలైజ్డ్ కిచెన్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం అక్కడ కూడా అధికారులకు పలు సూచనలు చేశారు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, తిరుమల వెంకటేశ్వర స్వామికి పూర్వ వైభవం తీసుకొస్తామని ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎన్టీఆర్ హయాంలో తిరుమలలో అన్నదానం ప్రారంభమైందని గుర్తుచేశారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా నిత్యం మూడు లక్షల మందికి అన్నదానం చేస్తున్నామని వివరించారు. తిరుమల గిరుల్లో గోవింద నామాలే వినిపించాలని అధికారులకు స్పష్టం చేశారు. తిరుమల పవిత్రత, నమ్మకం కాపాడేలా పనిచేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. తిరుమల కొండపై గోవింద నామస్మరణ తప్ప మరో మాట వినిపించకూడదని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతిలో ప్రశాతంతకు భంగం కలగకూడదు తేల్చి చెప్పారు. భక్తుల మనోభావాలకు సంబంధించి ఏ విషయంలోనూ రాజీ పడొద్దని కుండబద్దలు కొట్టారు. తిరుమలలో అందిస్తోన్న సేవలపై భక్తుల నుంచి స్పందన గురించి అధికారులను సీఎం చంద్రబాబు అడిగారు. తిరుమల వచ్చిన ప్రతి భక్తుడి అనుభవాల గురించి అభిప్రాయం చెప్పే అవకాశం కల్పించాలని సూచించారు. భక్తుల సలహాలు, సూచనలతో మరింత మెరుగ్గా సేవలు అందించొచ్చని పేర్కొన్నారు. ఒక్క తిరుమలలోనే కాక మిగతా ఆలయాల్లో కూడా భక్తుల అభిప్రాయం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డికి సూచించారు. తిరుమల లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదం నాణ్యత పెరిగిందని భక్తుల ు అంటున్నారు. ఇది ఇలానే కొనసాగాలి, సేవలు మరింత మెరుగుపడాలని సీఎం చంద్రబాబు అభిప్రాయ పడ్డారు. ప్రసాదాల తయారీలో వాడే పదార్థాల నాణ్యత బాగుండేలా చూడాలని కోరారు. ఉత్తమ పదార్థాలు మాత్రమే వాడాలని స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరా లకు తగినట్టు నీటి లభ్యత ఉండేలా చూసుకోవాలి. నీటి కోసం ముందస్తు ప్రణాళిక చాలా అవసరం. అటవీ ప్రాంతాన్ని 72 నుంచి 80 శాత ంపైగా పెంచాలి. అటవీ సంరక్షణతో పాటు అడవుల విస్తరణ కోసం వచ్చే ఐదేళ్లకు ప్రణాళికతో పనిచేయాలి. బయోడైవర్సిటీ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఏంటని అధికారులను సీఎం చంద్రబాబు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## రైతుకు నచ్చిన మిల్లుకే ధాన్యం రవాణా

### రైసు మిల్లుల ర్యాండమైజేషన్ విధానం రద్దు
### గోనె సంచులు, లేబర్, రవాణా సౌకర్యం ఏర్పాటు
### ధాన్యం సేకరణపై సీఎం చంద్రబాబు సమీక్ష
### మిల్లర్లు, రైతు సంఘాలతో మంత్రి నాదెండ్ల భేటీ



అమరావతి,ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ప్రతిబంధకంగా మారిన రైస్ మిల్లుల ర్యాండమైజేషన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఇకపై రైతులు సమీపం లోని తమకు ఇష్టమైన మిల్లులకే ధాన్యాన్ని తరలించు కునే వెసులుబాటు కల్పించాలని ధాన్యం సేకరణపై శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వం అమలుచేసిన ఈ ర్యాండమైజేషన్ విధానం వల్ల రైతులు తమ దాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వా నికి అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడాల్సివచ్చింది. రైతులు విక్రయించిన ధాన్యాన్ని సమీపంలోని మిల్లుకు కాకుండా ర్యాండమైజేషన్ పేరుతో దూరప్రాంతాల్లో ఉన్న వైసీపీ నేతలకు చెందిన మిల్లులకు రవాణా చేసేవారు. కొన్ని సందర్భాల్లో జిల్లాలను దాటించి వంద కిలోమీటర్లకు పైగా దూరాన ఉన్న మిల్లులకు తరలించాల్సి వచ్చేది దానికయ్యే లేబర్, రవాణా ఖర్చులను కూడా తమ నెత్తినే రుద్దడం వల్ల రైతులు నలిగిపోయారు. కనీసం గోనె సంచులు కూడా సరఫరా చేయలేని దుస్థితి నెలకొంది. అయితే, ఈ ఖరీఫ్ సీజన్ నుంచి ధాన్యం సేకరణలో రైతులకు సాధ్యమైనంత వరకు ఇబ్బందుల్లేకుండా నిబంధనలను సరళతరం చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారంఉండవల్లిలోని తన నివాసంలో ధాన్యం సేకరణ పై సమీక్ష నిర్వహించారు. సేకరణ ప్రక్రియలో రైస్ మిల్లుల ర్యాండమైజేషన్ విధానాన్ని రద్దు చేసి, రైతులు సమీపంలోని తమకు ఇష్టమైన మిల్లులకి ధాన్యాన్ని రవాణా చేసుకునే వెసులుబాటు కల్పించాలని ఆదేశించారు. అందుకు అవసరమైన రవాణా వాహనాలు, గోనె సంచులను సమకూర్చడంతోపాటు ధాన్యం ఎగుమతి, దిగుమతులకు అయ్యే లేబర్ చార్జీలను కూడా చెల్లించాలని అధికారులను ఆదేశించారు. కౌలు రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించేలా ప్రోత్సాహించాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో అవకతవకలకు తావులేకుండా రైతుల బయోమెట్రిక్ ఆధారంగా ధాన్యాన్ని సేకరించాలని, ఆ ధాన్యాన్ని ఏ మిల్లులకు రవాణా చేసే వాహనాలను జీపీఎస్ పరికరాల ద్వారా ట్రాక్ చేయాలని సూచించారు. మిల్లుల వద్ద అన్లోడింగ్ ఆలస్యం కాకుండా తగినంత మంది హమాలీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. సమీక్ష అనంతరం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్లో రైసు మిల్లర్లు, రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశ మయ్యారు. ధాన్యం సేకరణకు సంబందించి ప్రభుత్వం అమలు చేయనున్న విధివిధానాలపై వారికి అవగాహన కల్పించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు. భారత ఆహార సంస్థ అభ్యర్ధన మేరకు 2 లక్షల బాయిల్డ్ రైస్ (ఉడికించిన బియ్యం)ను కాకినాడ, కోన సీమ తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల రైసుమిల్లర్లు సర ఫరా చేయాల్సి ఉంటుందని తెలిపారు. సివిల్ సప్లయిస్ కమిషనర్ జి.వీరపాండియన్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీ అమూన్ తోపాటు రైతు సంఘాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

## ఈ ప్రభుత్వ తప్పును మాకు అంటగాడుతున్నారు..

### టీడీపీపై మాజీ మంత్రి కురసాల సీరియస్

అమరావతి : దేవుడిని కూడా టీడీపీ రాజకీయాల్లోకి లాగిందని మాజీ మంత్రి కురసాల కన్నబాబు విమర్శించారు. ఈ ప్రభుత్వంలో జరిగిన తప్పిదాన్ని గత ప్రభుత్వానికి అంటగడుతున్నారని మండిపడ్డారు. కాకినాడలో కురసాల మీడియాతో మాట్లాడుతూ.. లడ్డూ విషయంలో టీడీపీ దుష్ప్రచారం చేస్తూనే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.భక్తుల మనోభావాలకు టీడీపీ భంగం కలిగించిందని కన్నబాబు అన్నారు. గత ప్రభుత్వంపై బురద జల్లి రాద్ధాంతం చేశారని మండిపడ్డారు. సుప్రీంకోర్టు చివాట్లు పెట్టిన తర్వాత కూడా చంద్రబాబు అండ్ కో కట్టుకథలు ప్రచారం చేస్తూనే ఉన్నారని విమర్శించారు. జగన్‌ను తగ్గిస్తున్నామని అనుకుంటూ.. టీటీడీ విశిష్టతను దెబ్బతీస్తున్నారని ఆయన మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని కన్నబాబు అన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేసేందుకు టీడీపీ కుట్రలు చేస్తుందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్‌లో నాలుగువేల ఉద్యోగులను తొలగిస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసి మంచి ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలపై భారం పడుతుందని అన్నారు.

## ఉదయనిధిపై ఆరోపణల వ్యవహారం

### పవన్ కళ్యాణ్‌పై తమిళనాటి ఫిర్యాదు




చెన్నై,అక్టోబర్5: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై మదురైలో కేసు నమోదు అయ్యింది. తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయానిధి స్టాలిన్‌ను ఉద్దేశించి పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు గాను మధురైలోని కమిషనరేట్‌లో వాంజినాధన్ అనే న్యాయవాది ఫిర్యాదు ఇచ్చాడు. సనతాన ధర్మంపై ఉదయానిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను పవన్ వక్రీకరించి మాట్లాడాడని ఫిర్యాదులో తెలిపాడు. వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరాడు. తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయానిధి స్టాలిన్ సనాతన ధర్మంపై గత ఏడాది సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. సనాతన నిర్మూలన సభలో ముఖ్య అతిథిగా హాజరైన స్టాలిన్ మాట్లాడుతూ.. మనం డెంగ్యూను, దోమలను, మలేరియాను లేదా కరోనాను వ్యతిరేకించలేం. వాటిని నిర్మూలించాల్సిందే. అలాగే సనాతన ధర్మాన్ని కూడా నిర్మూలించాలని ఉదయనిధి చెప్పా రు. సనాతన అంటే సంస్కృతం నుంచి వచ్చిందని, ఇది సాంఘిక న్యాయం, సమానత్వాలకు, మహిళా సాధికారతకు వ్యతిరేకమని ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు.

## విజయవాడ దుర్గమ్మకు రూ. 18 లక్షల బంగారు మంగళసూత్రం బహూకరణ

అమరావతి : దేవీ నవరాత్రుల సందర్భంగా విజయవాడ దుర్గమ్మకు భక్తులు భారీగా కానుకలను సమర్పించుకుంటున్నారు. 9 రోజుల పాటు అత్యంత వైభవంగా ఇంద్రకీలాద్రిపై జరిగే ఉత్సవాలను తిలకించడానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుంటున్నారు.ప్రకాశం జిల్లా కొండేపీ నివాసి కల్లగుంట అంకులయ్య అనే కొబ్బరిబోండాలు అమ్ముకునే భక్తుడు రూ. 18 లక్షల విలువైన బంగారు మంగళసూత్రాన్ని శనివారం అమ్మవారికి బహూకరించారు. గుంటూరుకు చెందిన మరో భక్తుడు చేబ్రోలు పుల్లయ్య 6.5 కేజీల వెండితో తయారు చేయించిన హంసవాహనాన్ని కానుకగా సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రామారావు మాట్లాడుతూ భక్తుల కోరికలు తీర్చే దుర్గమ్మకు కానుకల రూపేణా అందజేసిన దాతలకు అభినందనలు తెలిపారు.



దాతలపై అమ్మవారి కటాక్షం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా శనివారం అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.






# శ్రీ ప్రస్థానం

తెలుగు దినపత్రిక

మన దేశం..మన హక్కు









## జమ్ము కాశ్మీర్‌లో గెలుపెవరిది మోదికి ఎదురుగాలి తప్పదా



అసెంబ్లీ ఎన్నికల్లో జేకేఎన్సీ-కాంగ్రెస్ కూటమి 46-50 స్థానాలు, బీజేపీ 23-27 స్థానాలు, జేకేపీడీపీ 7-11 స్థానాలు, ఏఐపీ 0-1, ఇతరులు 4-5 స్థానాలు గెలిచే అవకాశాలున్నట్లు సర్వేలో తేలింది. జేకేఎన్సీ-కాంగ్రెస్ కూటమిలో జేకేఎన్ఎస్ 33-35, కాంగ్రెస్ 13-15 స్థానాలు గెలవవచ్చు అని అభిప్రాయపడింది. జేకేఎన్సీ 29 శాతం, కాంగ్రెస్ 14 శాతం, బీజేపీ 24 శాతం, జేకేపీడీపీ 16 శాతం, ఏఐపీ 5 శాతం, ఇతరులు 12 శాతం ఓట్లు పొందవచ్చని సర్వేలో తేలింది. కలిసి పోటీ చేసిన జేకేఎన్సీ-కాంగ్రెస్ కూటమికి 43 శాతం ఓట్లు వచ్చే అవకాశాలున్నాయి. ఈ సర్వే ఫలితాల్లో మూడు శాతం ప్లస్ ఆర్ మైనస్ మార్జిన్ ఉండే అవకాశాలున్నాయి. జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రిగా ఎవరికి ప్రాధాన్యతిస్తారని సర్వేలో కోరగా జేకేఎన్సీ నేత, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు సుమారు 28 శాతం మంది మద్దతిచ్చారు. ఆయన అనుభవం రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతుందనే అభిప్రాయాన్ని ఓటర్లు వెలిబుచ్చారు.

ఒమర్ అబ్దుల్లా తండ్రి, రాష్ట్ర సీనియర్ నేత, మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లాకు సుమారు 2 శాతం మందే మద్దతిచ్చారు. జేకేపీడీపీ అధినేత, మాజీ సీఎం మెహబూబా ముఫ్తీకి, ఏఐపీ అధినేత లోక్‌సభ సభ్యులు రషీద్‌కు చెరో 8 శాతం మద్దతు సర్వేలో కనిపించింది. కాంగ్రెస్-జేకేఎన్సీ మధ్య పొత్తు ఈ ఎన్నికల్లో కీలకంగా పనిచేసింది. దాదాపు 46 శాతం మంది కాంగ్రెస్-జేకేఎన్సి కూటమి తమ ప్రయోజనాలకు ఉత్తమంగా ఉపయోగపడుతుందని విశ్వసించారు. జమ్మూకాశ్మీర్‌లో జేకేఎన్సీ పార్టీకి 30-35 సీట్లు వస్తాయి. కాంగ్రెస్ పార్టీకి 15 సీట్లు వచ్చే అవకాశం ఉంది. ఇక పీడీపీకి కాంగ్రెస్ కన్నా ఎక్కువ శాతం ఓట్లు వచ్చి.. సీట్ల సంఖ్య మాత్రం తక్కువగా ఉంటుందని పీపుల్స్ పల్స్ సర్వే పేర్కొంది. గత ఎన్నికల్లో పీడీపీ-బీజేపీ కలిసి జమ్మూ కశ్మీర్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. 2019లో ఆర్టికల్ 370 రద్దు చేసింది బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం. ఆర్టికల్ 370 ఎత్తివేయడంపై కశ్మీర్ వాసులు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. దీనికి తోడు నిరుద్యోగ సమస్య, మౌలిక వసతుల లేమి, అధిక ధరలు, రాష్ట్ర హోదా లేకుండా న్యాయం జరగదని అక్కడి ప్రజలు విశ్వసిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జమ్మూ కశ్మీర్‌కు అనేక హామీలు ఇచ్చింది. రాష్ట్ర హోదా కూడా ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ, ఆ హామీని ఆలస్యం చేసింది. దీంతో బీజేపీపై అక్కడి ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు.




## ఆరు నెలలు కాకుండానే జగన్ తొందరపడుతున్నారా...

వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి సార్వత్రిక ఎన్నికల యుద్ధంలో ఘోర పరాజయం తర్వాత మరో యుద్ధానికి సిద్ధం కావాలంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మళ్లీ శాసనసభ ఎన్నికలకు నాలుగున్నరేళ్ల సమయం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సైతం దాదాపు మరో ఏడాది సమయం ఉంది. ప్రస్తుతం ఎన్నికల సమయం కాకపోయినా ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వైసీపీ అనుబంధ సంఘాల నాయకుల సమావేశంలో కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు.. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జగన్ ఈ వ్యాఖ్యలు చేసి ఉండొచ్చు. అదే సమయంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కూడా కాలేదు. ఈలోపే ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజల విశ్వాసం కోల్పోయిందని చెప్పుకొచ్చారు. వాస్తవానికి ఓ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ ప్రభుత్వానికి కనీసం ఏడాది సమయం ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల ప్రకారం నడుచుకోకపోతే ప్రశ్నించాల్సిన బాధ్యత విపక్షాలపై ఉంటుంది. ఈలోపు ప్రభుత్వం సక్రమంగా పనిచేయకపోతే నిలదీయాల్సిన బాధ్యత విపక్షాలదే. ఓవైపు కూటమి ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నట్లు చర్చ జరుగుతున్న వేళ వైసీపీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునివ్వడం వెనుక ఉన్న మతలబు ఏమిటనే చర్చ సాగుతోంది.



## కొలికపూడి సమస్య కొలిక్కివచ్చిందా..?

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని తిరువూరు నియోజకవర్గం టీడీపీలో అంతర్గత విబేధాలు సమసిపోయినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహారశైలిపై స్థానిక నేతలు అసంతృప్తిగా ఉన్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే తీరుపై అధిష్టానానికి వరసు ఫిర్యాదులు



వెళ్లడంతో తిరువూరు పంచాయితీ ఎన్టీఆర్ భవన్‌కు చేరింది. దీంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని చిన్ని, సీనియర్ నేతలు వర్ల రామయ్య, మంతెన సత్యనారాయణ రాజు తదితరులు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును పిలిపించి మాట్లాడారు. తన పనితీరు కొందరికి ఇబ్బందులు కలిగిస్తాయని తాను ఊహించలేదన్నారు. తన కారణంగా తలెత్తిన ఇబ్బందులను సరిచేసుకుంటానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు హైకమాండ్‌కు తెలిపారు. ఇకనుంచి పార్టీ నాయకులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తానన్నారు. ఆదివారం తిరువూరులో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం పెట్టాలని నేతలు నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొనున్నారు. ఇటీవల తిరువూరులో చోటుచేసుకున్న పరిణామాలపై అధిష్టానం ఎమ్మెల్యే కొలికపూడి వివరణ కోరింది. రాష్ట్రాభివృద్ధి కోసం సీఎంగా చంద్రబాబు ఎంతో కష్టపడుతున్నారని, చిన్నపాటి సమస్యల వల్ల పార్టీకి చెడ్డపేరు రాకూడదన్నారు. పార్టీ బలోపేతం, కార్యకర్తల మధ్య సమన్వయం కోసం అందరూ కలిసి ముందుకెళ్లాలన్నారు. తిరువూరులో జరిగే సమావేశంలో అన్ని విషయాలపై సమగ్రంగా చర్చిద్దామన్నారు. పార్టీ శ్రేణులను కలుపుకునిపోతూ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఆదివారం నాటి సమావేశం జరగనుందన్నారు. ఏ పార్టీలో అయినా చిన్న చిన్న సమస్యలు సహజమని, కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు సమసిపోతాయన్నారు.

## కొండెక్కిన టమాటా ధర..

దేశవ్యాప్తంగా టమాటా ధరలు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. కిలో టమాటా ధర రూ.100 పలుకుతుండడంతో ప్రజలు నోరెళ్లబెడుతున్నారు. పండగ సీజన్ కావడం, ఉత్పత్తి కొరత కారణంగా రేట్లు ఆకాశాన్ని అంటుతున్నట్లు నిపుణులు చెప్తున్నారు. నిన్న మొన్నటి వరకూ కిలో రూ.40 ఉన్న ధర ఒక్కసారిగా రూ.100కు పెరగడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ప్రజల్లో నెలకొంది. కూర ఏదైనా కానీ టమాటా వేయనిదే వంట పూర్తి కాదని పెద్దలు అంటుంటారు. అలాంటిది ఇంత ధర పెట్టి ఇప్పుడు ఎలా కొనుగోలు చేయాలంటప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## రేపే భారత్ పాకిస్తాన్ కీలక మ్యాచ్

ఐసీసీ టీ20 మహిళల ప్రపంచకప్‌లో భారత జట్టుకు శుభారంభం దక్కలేదు. నిన్న జరిగిన తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై టీమిండియా ఘోర పరాజయం పాలైంది. ఈ క్రమంలోనే రేపు (అక్టోబర్ 6న) పాకిస్తాన్‌తో టీమిండియా రెండో మ్యాచ్ ఆడాల్సి ఉంది. ప్రస్తుతం తొలి మ్యాచ్‌లో ఓడిన భారత్ తర్వాతి మ్యాచ్‌లో గెలవడం తప్పనిసరి అని చెప్పవచ్చు. అంతేకాదు ఇప్పటికే పాకిస్తాన్ జట్టు శ్రీలంకను ఓడించింది. దీంతో రేపటి మ్యాచ్ చాలా ఉత్కంఠభరితంగా కొనసాగనుంది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటల

## దేవీ నవరాత్రుల్లో మూడో రోజు

నవరాత్రుల్లో ముచ్చటగా మూడోరోజు అంటే శనివారం అమ్మలగన్నయమ్మ.. ముగ్గురమ్మల మూలపుటమ్మ.. దుర్గమ్మ శ్రీఅన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. సృష్టి, స్థితి, లయకు కారణభూతమైన దుర్గమ్మ. సమస్త జీవకోటికి ప్రాణాధారమైన ఆహారాన్ని అందించే దేవతగా శ్రీ అన్నపూర్ణదేవిని భక్తులు కొలుస్తారు. దేశవ్యాప్తంగా శరన్నవరాత్రులు ప్రారంభమైనాయి. దుర్గమ్మ తొలి రోజు శ్రీబాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో.. రెండో రోజు వేద మాత శ్రీ గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇక ముచ్చటగా మూడోరోజు.. అంటే శనివారం అమ్మలగన్నయమ్మ.. ముగ్గురమ్మల మూలపుటమ్మ.. దుర్గమ్మ శ్రీఅన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. సృష్టి, స్థితి, లయకు కారణభూతమైన దుర్గమ్మ. సమస్త జీవకోటికి ప్రాణాధారమైన ఆహారాన్ని అందించే దేవతగా శ్రీ అన్నపూర్ణదేవిని భక్తులు కొలుస్తారు. అన్నం.. జీవుల మనుగడకు ఆధారం. అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపమని పెద్దలు స్పష్టం చేశారు. ఈ రూపంలో అమ్మవారిని పూజిస్తే బుద్ధి వికాసం, సమయస్ఫూర్తి, కుశలత, వాక్‌సిద్ధి సిద్ధిస్తాయని శాస్త్ర పండితులు పేర్కొంటున్నారు. అన్నపూర్ణదేవిని పూజిస్తే.. ఆకలిదప్పులు లాంటి బాధలు ఉండవని వారు స్పష్టం చేస్తున్నారు.



# సంపాదకీయం

ఆదివారం 06-10-2024

## కంపుకొడుతున్న మూసీ రాజకీయాలు !

తెలంగాణలో మూసీ రాజకీయాలు కొనసాగుతున్నాయి. మురికి కంపు కొట్టిస్తున్నాయి. చివరకు జుగుపస కలిగిస్తున్నాయి. పరస్పర విమర్శలు, బజార్ భాష వాడడం గతంలో ఎప్పుడూ లేనంతగా వినిపిస్తోంది. రాజకీయనాయకులు దిగజారి పోయారు. ముఖ్యంగా కొండా సురేఖ వ్యాఖ్యలతో చిత్రపరిశ్రమ ఎన్నడూ లేనంతంగా ఆక్రందన చెందింది. అలాగే కెటిఆర్‌పై సురేఖ చేసిన వ్యాఖ్యలు, సోషల్ మీడియా పోస్టులు గమనిస్తే రాజకీయాలు ఎంతగా దిగజారి పోయాయో అర్థం చేసుకోవచ్చు. ఇకపోతే మూసీ అభివృద్ధి పేరుతో ప్రభుత్వం చేపట్టిన పనులు విపక్షాలకు అస్త్రంగా మారింది. మూసా ఈప్రాజెక్టును విపక్ష బిజెపి, బిఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వం కూడా మిగతా ప్రాధాన్యాలను వదిలేసి కేవలం మూసీ, హైడ్రాలనే ప్రధానంగా ఎంచుకున్నది. నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడం, ధరలపై చర్యలు తీసుకోవడం, మంచినీటి సమస్యను తీర్చం వంటి అనేకానేక సమస్యలు వేధిస్తున్నా పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ మంత్రులు కూడా తలాతోక లేకుండా మాట్లాడేస్తున్నారు. మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన ప్రాజెక్టుపై ప్రజా వ్యతిరేకత పెరుగుతోంది. బాధితులకు అండగా బిఆర్ఎస్, బిజెపి నేతలు నిలిచారు. వారికి మద్దతుగా పోరాడుతున్నారు. బాధితులు కూడా మూసీని వదిలి వచ్చేందుకు ఇష్టపడడం లేదు. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా మూసీ ఆక్రమణలకు గురవుతూనే ఉంది. ఈ ప్రాజెక్టును చేపట్టడం ఆహ్వానించదగ్గ పరిణమామే. కానీ ప్రజలకు ఆమోదయోగ్యంగా ప్రణాళిక ఉండాలి. ఈ క్రమంలో అధికార, విపక్షాల మధ్య మాటలతూటాలు పేలుతున్నాయి. విమర్శలు హద్దులు దాటుతున్నాయి. ఈ సమస్య తీవ్రం కాకముందే తాత్కాలికంగా మూసీ ప్రాజెక్టును పక్కన పెట్టి చర్చించాలని పలువురు మేధావులు సైతం సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో నాటి కెసిఆర్ ప్రభుత్వ అవినీతిపై కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. అప్పులు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలు బాగా బయటకు వచ్చాయి. వీటిపైనే దృష్టి పటెట్ఇ ఉంటే బాగుండేది. ఈ రెండు విషయాలు ప్రభుత్వ ప్రాధాన్యం నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. కేవలం ఇప్పుడంతా మూసీ ప్రాజెక్ట్‌పై రాజకీయం నడుస్తోంది. ఓ రకంగా చెప్పాలంటే సీఎం రేవంతే ప్రతిపక్ష బీఆర్ఎస్,బిజెపిలకు ఆయుధాలు అందిస్తున్నారని అన్నారు. మూసీతో విపక్షాలు గట్టిగానే వినిపిస్తున్నాయి. సిఎం రేవంత్ కూడా ఏమాత్రం దూకుడు తగ్గించుకోవడానికి సిద్దంగా లేరు. హైదరాబాద్‌లో హడలెత్తిస్తున్న హైడ్రా, మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ఇళ్లపై బుల్డోజర్ల వంటి కార్యక్రమాలపై ఇప్పుడు సమీక్షించు కోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ నిర్ణయాలు ఎప్పుడైనా ప్రజామోదంగానే ఉండాలి. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నేతలు అందుకు కారకులైన మాజీ సీఎం కేసీఆర్‌ను, బిఆర్ఎస్ నేతలను ఇరికిస్తారని ప్రచారం జరిగింది. అయితే అలాంటిదేఈ లేదని తేలపోయింది. ప్రభుత్వ ఆర్థిక వనరులు, ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా సిఎం రేవంత రెడ్డి మాట్లాడుతున్నారు. ఇకపోతే కాంగ్రెస్ రుణమాఫీ కూడా ఎదురుదిరుగుతోంది. కాంగ్రెస్ రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని ప్రభుత్వం అంటోంది. అయితే జరగలేదని విపక్షం అంటోంది. ఈ వజషయంలో విపక్షబీఆర్ఎస్‌కు కాంగ్రెస్సే ఆయుధం సమకూర్చినట్లైంది. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇబ్బడిముబ్బడిగా హామిలిచ్చిందని వాటిని అమలు చేయడం లేదని బిజెపి, బిఆర్ఎస్ నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అటు హైడ్రా, మూసీ, ఇటు రైతు రుణమాఫీ తదితర పనులతో కొంత ప్రజా వ్యతిరేకత మొదలైందని చెప్పాలి. ఇకపోతే ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దివంగత మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ స్వేచ్ఛ ఇచ్చిందని , కానీ రేవంత్ విషయంలో అది జరగడం లేదని అంటున్నారు. మంత్రులు ఎవరికి వారే ముఖ్యమంత్రులుగా వ్యవహరి స్తున్నారు. కాంగ్రెస్ చేస్తున్న తప్పిదాలు బీఆర్ఎస్‌కు అందివచ్చిన అవకాశంలా మారాయి. తమది నిర్మాణాత్మక ప్రభుత్వం అయితే కాంగ్రెస్‌ది కూల్చివేతల ప్రభుత్వం అంటూ కెటిఆర్ విమర్శలు గుప్పిస్తు న్నారు. ఎన్నికల వరకు ఊపుమీదున్న బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా ఎదగలేకపోతోంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై హైకోర్టులో కేసులు వెన్నాడుతున్నాయి. మరోవైపు మూసీ కూల్చివేతలు, సర్వే నిర్వాసితుల్లో దడ పుట్టిస్తున్నది. తహసీల్దార్ల బృందం మూసీ పరీవాహక ప్రాంతాల్లో సంచరిస్తూ నిర్వాసి తులను ఒప్పించే యత్నం చేస్తున్నది. ఆ బృందాలను చూస్తేనే అక్కడి జనం వణికిపోతున్నారు. విడదసీ.. తరలించు అన్నట్టుగా ఒక్కో బృందం కొన్ని కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని వారిని ఖాళీ చేయించే చర్యలకు పాల్పడుతున్నది. తమంతట తాము ఖాళీ చేస్తే రూ.25 వేల పారితోషకం ఇస్తామంటూ ఆశ చూపిస్తున్నారు. కానీ చాలామంది తమ గూడును వదలడానికి అంగీకరించడంలేదు. కొంతమంది పెద్ద దిక్కులేని వాళ్లు భయంగానే అంగీకరించినట్టు చెప్తున్నారు. చాలామంది డబ్బులు పెట్టి జాగాలు కొనుక్కొని ఇండ్లు కట్టుకున్నారు. మూసీ బాధితులు మొత్తంగా రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నది. విపక్షాలు తోడు కావడంతో ఇప్పుడు పరిస్థితి చేజారి పోయే ప్రమాదం ఏర్పడింది.మూసీ సుందరీకరణను ఎవ్వరూ తప్పు పట్టడం లేదు. హైదరాబాద్ అభివృద్ధికి మూసీ సుందరీకరణ కూడా తోడవ్వాలి. అది విమర్శలకు దారితీయ కుండా ప్రశంతంగా సాగితే అందరికీ మంచిది. అలాగే ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కూడా ముమ్మరంగా సాగాలి. దెబ్బతిన్న రోడ్లు బాగు చేయడ ంలో ముం దుకు రావడం లేదు. ఈ విషయంలో తోణ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# జనసేన విస్తరణ దిశగా పవన్



విజయవాడ, అక్టోబరు 5,రాజకీయాలు ఎంత విచిత్రంగా ఉంటాయంటే ఏదో సినిమాలో చెప్పినట్టు " లైట్ ఎక్కడో ఉంటుంది.. దాని స్విచ్చు ఇంకెక్కడో ఉంటుంది". నాయకుల స్పీచ్ గమనిస్తే యథాలాపంగా మాట్లాడిన మాటల వెనుక చాలా పెద్ద వ్యూహమే కనపడుతుంది. దానికి పవన్ కల్యాణ్ వారాహి డిక్లరేషన్ ప్రసంగం బెస్ట్ ఎగ్జాంపుల్. ఎక్కడో ఆవు నెయ్యి కల్తీ దగ్గర మొదలైన రచ్చ పవన్ సనాతన ధర్మం కోసం తమిళంలో నిప్పులు చెరిగిన వరకు చేరుకుంది. సనాతన ధర్మ బోర్ట్ అనీ ధర్మ పరిరక్షణ అనీ పవన్ చాలా అంశాల మీదే మాట్లాడినా అసలు టార్గెట్ మాత్రం తమిళ రాజకీయ చిత్రమే అని అర్థమయిపోతుంది అంటున్నారు విశ్లేషకులు.పవన్ కల్యాణ్ ఎంత తెలివైనవాడు అంటే అత్యంత సన్నిహితంగా మెలుగుతున్న వారు కూడా ఆయన వ్యూహం ఏంటి అనేది సరిగ్గా అర్థం చేసుకోలేకపోయారు. ఆయన ఆవేశమంతా ఏదో జగన్ మీదనో.. తిరుమలలోని ఆ కల్తి నెయ్యి వివాదం మీదనో అని భావించారు. కానీ ఆయన తన పార్టీని విస్తృతపరిచే దిశగా అడుగులు వేస్తున్న సంగతి స్పష్టమైపోయింది. ఫక్తు ద్రవిడ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే తమిళనాడులో ఆల్టర్నేటివ్ పొలిటికల్ థాట్‌ను బిల్డ్ చేసే పనిలో పవన్ ఉన్నట్టు తెలిసిపోతుంది. తమిళనాడులో ఎంట్రీ ఇవ్వడం కోసం జాతీయ పార్టీలు చాలా ప్రయత్నించాయి. కానీ ఎంజీఆర్,కరుణానిధి కాలం నుంచి కూడా అది వర్కౌట్ కాలేదు. వారిద్దరనే కాదు తర్వాత కాలంలో జయలలిత, కరుణానిధి మధ్య ఎంతటి పొలిటికల్ వైరం నడిచినా బయట వ్యక్తులని వారు ఎంటర్ కానివ్వలేదు. మధ్యలో శరత్ కుమార్, విజయ కాంతుల లాంటి వాళ్ళు పార్టీలు పెట్టినా స్థానిక అంశాల మీదనే ఫోకస్ చేశారు. అంతే కానీ యాంటీ ద్రవిడియన్ థాట్ ఏ మాత్రం తమిళనాట ఎంకరేజ్ చేయలేదు. పోనీ వాళ్లందరి హవా ముగిసిపోయిన తర్వాత అంటే కరుణానిధి, జయలలిత మరణంతో తమిళ రాజకీయాల్లో ఒక ఖాళీ ఏర్పడింది. దీన్ని అవకాశంగా తీసుకుందామనే జాతీయ పార్టీలకు స్టాలిన్ అడ్డుగా నిలబడ్డారు. శశికళ, అన్నామలైల ద్వారా తమిళనాట ప్రయోగం చేద్దామనుకున్న బీజేపీ బోల్తా పడింది. లేటెస్ట్‌గా తమిళ దళపతి విజయ్ సినిమాలకు బ్రేక్ ఇచ్చి రాజకీయాల్లోకి వచ్చారు. మరో రెండేళ్లలో జరిగే తమిళనాడు ఎన్నికల్లో ప్రధాన పోటీ డీఎంకే, విజయ్ పార్టీ ఎఐ మధ్యే ఉండే అవకాశాలు ఎక్కువగా కనబడుతున్నాయి. విజయ్ కూడా తన సినిమాల ద్వారానో, అభిప్రాయాల ద్వారానో పూర్తిగా ద్రవిడ భావజాలాన్ని ప్రకటిస్తూ వచ్చారు. "మెర్సల్" సినిమాలో ఊు పై తను పేల్చిన డైలాగ్స్ దేశవ్యాప్తంగా పెద్ద చర్చనే రేపాయి. ఆ టైంలో ఢిల్లీ పెద్దల ఆగ్రహానికి గురైన ఘటనలు కథనాలుగా చూసాం. మరోవైపు స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ తమిళనాడు ఉప ముఖ్యమంత్రి హోదాలో ప్రస్తుతం ఉన్నారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ ఆయన ఇచ్చిన స్టేట్మెంట్ ఏ రేంజ్‌లో ప్రకంపనలు సృష్టించాయో తెలిసిందే. సో భవిష్యత్తులో తమిళనాడులో పార్టీలు తమలో తాము ఎంతగా కొట్లాడుకున్నా మత ఆధారిత రాజకీయాలవైపు మొగ్గు చూపే ఛాన్స్ లేదు. దీనినే ఒక అవకాశంగా పవన్, ఆయన సన్నిహితులైన ఢిల్లీ పెద్దలు భావిస్తున్నారని సమాచారం.అసలు తమిళనాడు అనేది పొలిటికల్‌గా జాతీయ పార్టీలకు చాలా అవసరం. యూపీఏ కావొచ్చు, ఎన్డీఏ కావొచ్చు వాళ్ల ప్రవేశపెట్టే చాలా నిర్ణయాలకు తమిళ ఎంపీల మద్దతు అవసరం. 39 మంది ఎంపీలు ఉన్న తమిళనాడు రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఏకతాటిపైనే ఉంటూ వచ్చింది. పార్టీలు వేరైనా రాష్ట్ర ప్రయోజనాలు అంటే మాత్రం ఏకమైపోతారు అక్కడి రాజకీయ నేతలు. అందుకే జాతీయ పార్టీల వ్యూహాలు అక్కడ పనిచేయడం లేదు. పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు ఇలా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించినది ఏదైనా సరే కేంద్ర ముక్కుపిండి మరీ తమిళ పార్టీలు పట్టుకెళ్ళిపోతాయి. అందుకే ఎలాగైనా సరే తమిళ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి పట్టు బిగించాలనేది పవన్, ఆయన ఢిల్లీ స్నేహితుల అజెండాగా కనబడుతోంది.తన సనాతన ధర్మ పరిరక్షణ ప్రసంగాలతో సంచలనం సృష్టిస్తున్న పవన్ మొదట్లో తమిళ నటుడైన కార్తీ, అక్కడ బాగా పట్టున్న ప్రకాష్ రాజ్‌ను టార్గెట్ చేసినట్టు కనిపించినా.. నిన్న పేరు చెప్పకపోయినా ఉదయనిధి స్టాలిన్‌ను విమర్శించినా తమిళ రాజకీయాలను దృష్టిలో పెట్టుకునే అన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అన్నామలై లాంటి వాళ్ళ ఆవేశ పూరిత రాజకీయాల ద్వారా తమిళ ప్రజల్లోని ఒక సెక్షన్‌లో ప్రభావం పెంచుకుంది బీజేపీ. ఇప్పుడు సినీ రంగంలో పవర్ స్టార్ స్థాయిలో ఉన్న తమ స్నేహితుడు పవన్‌ని ఉపయోగించుకుని తమిళనాట బాగా చొచ్చుకుపోయే వ్యూహం పన్నిందనేది పొలిటికల్ ఎనలిస్టుల అంచనా. దానికి తగ్గట్టుగానే పవన్ అడుగులు కదుపుతున్నారని అందుకే పనికట్టుకుని మరీ తమిళ ఇంటర్వ్యూలు, తమిళ స్పీచ్‌లు ఇస్తూ తమిళ ప్రజల అభిమానం పొందే పనిలో పడ్డారనే వాదన కూడా వినిపిస్తోంది. అసలే తమిళ నాట భాషాభిమానం, సినీ అభిమానం ఓ రేంజ్ లో సక్సెస్ అయిన ఫార్ములాలు. వాటికి తోడు సనాతన ధర్మ రక్షకుడిగా ఓ కొత్త వాదనతో తమిళ రాజకీయాల వైపు పవన్ అడుగులు వేస్తున్న దృశ్యం చాలా స్పష్టంగా కనబడుతుంది

## పథకాలు సరే.... ఆ రెండింటి సంగతేంటీ,,,,

గుంటూరు, అక్టోబరు 5, ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తోంది. జూన్ 12న కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసింది. అటు తరువాత మంత్రులు కొలువుదీరారు. ఈ ఎన్నికల్లో చాలావరకు హామీలు ఇచ్చారు చంద్రబాబు. అందుకు తగ్గట్టుగానే కీలక ఐదు హామీలకు సంబంధించి ఫైళ్లపై సంతకాలు చేశారు. మూడు వేల రూపాయలు ఉన్న పింఛన్ మొత్తాన్ని నాలుగు వేలకు పెంచారు. ముందుగానే హామీ ఇచ్చినట్టు ఏప్రిల్ నెల నుంచి బకాయిలు అందించారు. అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేశారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేసేందుకు యోచిస్తున్నారు. అయితే కీలకమైన అన్నదాత సుఖీభవ, అమ్మఒడి వంటి పథకాలు ప్రారంభానికి నోచుకోలేదు. ఎప్పుడు అమలు చేస్తారో కూడా తెలియడం లేదు. కనీసం దాని గురించి సన్నాహాలు కూడా లేవు. ఈ ఏడాది జూన్ లో కూటమి అధికారంలోకి వచ్చింది. అదే నెలలో విద్యా సంవత్సరం ప్రారంభమైంది. జూలైలో ఖరీఫ్ మొదలైంది. కానీ పిల్లల చదువుకు సాయం లేదు. ఇటు అన్నదాత సుఖీభవ కింద రైతులకు సాయం అందించలేదు. అసలు ఈ ఆర్థిక సంవత్సరానికి అందించే ఉద్దేశం ఉందా? లేదా? అన్నది తెలియాలి. మంత్రులు మాత్రం అడపాదడపా ప్రకటనలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. దీనిపై ప్రజల నుంచి విమర్శలు ప్రారంభమవుతున్నాయి. ప్రభుత్వంపై వ్యతిరేకతకు కారణమవుతున్నాయి ఈ పరిణామాలు2019లో జగన్ అధికారంలోకి వచ్చారు. ఆ ఎన్నికల్లో నవరత్నాలు కింద హామీలు ఇచ్చారు. అందులో ఒకటి అమ్మ ఒడి. ఇలా అధికారంలోకి వచ్చారో లేదో.. తొలి ఏడాది అమ్మ ఒడి అమలు చేశారు. ప్రతి కుటుంబంలో చదువుకుంటున్న పిల్లల్లో ఒకరికి అమ్మ ఒడిని వర్తింపజేశారు. తొలి ఏడాది 15 వేల రూపాయలు అందించారు. అందులో 1000 రూపాయలు ను పాఠశాల నిర్వహణకు గాను కోత విధించారు. అటు తరువాత వరుసగా మూడేళ్ల పాటు అమ్మ ఒడిని అమలు చేయగలిగారు. అయితే ఈసారి 13000 లబ్ధిదారుల ఖాతాలో.. రెండు వేల రూపాయలను మాత్రం పాఠశాల నిర్వహణ ఖర్చులకు గాను తీసుకున్నారు. అయితే తాను అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మంది చదువుకు సాయం చేస్తానని చంద్రబాబు ప్రకటించారు. కానీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటుతున్నా ఇంతవరకు అమలు చేయలేదు.అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా పేరును మార్చారు. అన్నదాత సుఖీభవ గా మార్చి దాని వెబ్సైట్ను సైతం మార్చేశారు. దీంతో ఈ ఖరీఫ్ నుంచే అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు 20,000 అందుతుందని ఆశించారు. కానీ ఖరీఫ్ దాటిపోతోంది. ఇంతవరకు అన్నదాత సుఖీభవ పథకానికి శ్రీకారం చుట్టా లేదు. కనీసం సన్నాహాలు కూడా చేయలేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వంతో పని లేకుండా కేంద్రం పిఎం కిసాన్ సామాన్ నిధిని కొనసాగిస్తుంది. రేపు రైతుల ఖాతాలో కేంద్ర సాయం కింద రెండు వేల రూపాయలు జమ కానుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వ పరంగా ఇస్తామన్న నగదు సాయం మాత్రం అందకుండా పోతుంది. దీనిపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అన్నింటికీ మించి ఈ రెండు పథకాలు కీలకంగా ఉన్నాయి. ప్రజల్లో మాత్రం ఆ స్థాయిలో సంతృప్తి కనిపించడం లేదు. మిగతా పథకాల పేరు చెప్పి కాలం గడిపేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

## శ్రీకాళహస్తిలో దేవి నవరాత్రులు రెండవరోజు అమ్మవారు మహావిష్ణువు అలంకారం

కాళహస్తి,శ్రీ వాయులింగేశ్వరస్వామి వెలసిన శ్రీకాళహస్తీశ్వర ఆలయం నందు దేవీ నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు అమ్మవారిని మహావిష్ణువు అలంకారంలో సర్వాంగ సుందరంగా అలంకరించి అలంకార మండపం నుండి అంజంజి గణపతి, బాల జ్ఞానాంబిక మహానంది సన్నిధానం తదుపరి ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు వద్ద తీసుకొని వచ్చి విశేష పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని జ్ఞాన ప్రసూనాంభ సమేత వాయులింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి ఏఈఓ లోకేష్ రెడ్డి సూపర్డెంట్ అండ్ సి.ఎస్.ఓ.నాగభూషణం యాదవ్, మరియు ఆలయ అధికారులు సిబ్బంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## కాలువలో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి

కాకినాడ,కాకినాడ రూరల్ కొవ్వూరు గ్రామం లో కాలువ లో స్నానానికి వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. మృతదేహాలను కాకినాడ ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించారు. మృతి చెందిన బాలురు తూరంగి గ్రామం ఉప్పరపేటకు చెందిన రెండవ తరగతి చదువుతున్న జక్కి అభిరామ్ వయసు (8 ), మూడవ తరగతి చదువుతున్న గండికోట దుర్గప్రసాద్ వయసు (10) గా గుర్తించారు.

# కూటమిలో ఎవరికి వారే...

నెల్లూరు, అక్టోబరు 5, ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇటీవలే వంద రోజులు దాటింది. అయితే పిఠాపురం నుంచి ఆదోని వరకూ, ధర్మవరం నుంచి ఒంగోలు వరకూ కూటమి పార్టీల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. కూటమికి ముందు కుదిరిన పొత్తులతో మూడు పార్టీలు ఏకమై జగన్ ప్రభుత్వాన్ని అయితే ఓడించగలిగారు కానీ, తమ నియోజకవర్గంలో గెలిచిన నేతలు ఆధిపత్యాన్ని సహించలేకపోతున్నారు. ఇగోలు విభేదాలకు ప్రధాన కారణం. ఎవరి పార్టీ వారిదే. ఎవరి జెండా వారిదే. ఎవరి అజెండా వారిదే. తమ పార్టీ క్యాడర్ కోసమే కూటమి పార్టీలు పట్టుబడుతుండటంతో మిత్రపక్షాలకు చెందిన నేతల్లో విభేదాలు రచ్చకెక్కాయని చెప్పక తప్పదు. ఇందులో ఏ పార్టీ నేతదీ తప్పు కాదు.ఎందుకంటే ఎవరి క్యాడర్ ను వారు కాపాడుకోవాలి. ఎవరి జెండాను వారు పదిలంగా ఉంచుకోవాలి. 2024 ఎన్నికలలో కూటమి పార్టీల క్యాడర్, నేతలు అందరూ కలసికట్టుగా పనిచేశారు. టిక్కెట్ దక్కకపోయినా కలసి మెలసి జెండాలను మోశారు. అయితే కూటమి పార్టీల మధ్య ఎన్నికల అనంతరం మాత్రం విభేదాలు అధినాయకత్వాలను కలవరపెడుతున్నాయి. ప్రధానంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహించే పిఠాపురంలోనూ టీడీపీ, జనసేనల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే సీటును త్యాగం చేసిన ఎస్‌వీఎస్ఎన్ వర్మ ప్రభుత్వం ఏర్పాటయిన నెల రోజుల నుంచే అసంతృప్తితో ఉన్నారు.అక్కడ జనసేన నేతలకు, వర్మకు మధ్య గ్యాప్ బాగా పెరిగింది. లోకల్ నాయకత్వం మధ్య అస్సలు పొసగడం లేదు. తాజాగా పిఠాపురం అర్బన్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలకు అమితుమీ సిద్ధమవుతున్నారు టీడీపీ, జనసేన నేతలు. ఈ ఎన్నికలు పార్టీ గుర్తు లేకుండా జరిగేవి అయినా అధికారం ఉన్న పార్టీలు డైరెక్టర్ల పదవులను పంచుకుని ఏకగ్రీవం చేసుకునే వీలుంది. ఐదు డైరెక్టర్ల పోస్టులకు నోటిఫికేషన్ వెలువడగానే జనసేన నేతలు తమ అభ్యర్థులను రంగంలోకి దించారు. దీంతో వర్మ కూడా తన అనుచరులను పోటీకి దించి సై అన్నారు. రెండు పార్టీల నుంచి చెరో ఐదుగురు పోటీ చేస్తుండటంతో రెండు పార్టీల మధ్య పోటీ అనివార్యమయింది. ఒక రకంగా రెండు పార్టీలూ బలనిరూపణకు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 6వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి.ఆదోని నియోజకవర్గంలో అక్కడి సిట్టింగ్ బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడుకు మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు పొడసూపాయి. ఇద్దరు వేర్వేరుగా ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీంతో క్యాడర్ కూడా రెండుగా విడిపోయారు. ఆధిపత్య పోరే దీనికి కారణమని తెలుస్తోంది. ఇక ధర్మవరంలో బీజేపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు టీడీపీ నేతలకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. మున్సిపల్ కమిషనర్ నియామకం ఇందుకు కారణం. ఒంగోలులో టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. జనసేనలో చేరిన బాలినేని వదిలేది లేదని చెబుతున్నారు. ఇవి కేవలం ఉదాహరణ మాత్రమే అనేక నియోజకవరాల్లో కూటమి పార్టీల నేతల మధ్య రచ్చ రంబోలా పార్టీ అధినేతలకు తలనొప్పిగా మారనున్నాయి. ధర్మవరంలో ఎన్నికల ముందు వరకూ ఉన్న ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ ను కాదని కూటమి ఏర్పడిన తర్వాత ఆ స్థానాన్ని బీజేపీకి కేటాయించింది. అప్పటి వరకూ తానే విజేత అని భావిస్తున్న నాటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సత్యకుమార్ ను ఎంపిక చేయడంతో గెలుపు తనదేనని భావించారు. అయితే టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు సమిష్టిగా పనిచేసి ధర్మవరంలో కేతిరెడ్డిని స్వల్ప ఓట్ల మెజారిటీతో ఓడించగలిగారు. మిగిలిన నియోజకవర్గాల్లో యాభై వేలకు పైన వచ్చి మెజారిటీలు ధర్మవరానికి వచ్చేసరికి మాత్రం రెండు వేలకు మించలేదు. అయినా అందరూ కలసి పనిచేయడంతోనే సత్యకుమార్ విజయం సాధించారు/అయితే అదృష్టం సత్యకుమార్ ఇంట్లోనే ఉంది. కేవలం ఎమ్మెల్యేగా గెలవడమే కాకుండా బీజేపీలో నమ్మకమైన నేతగా ఉన్న ఆయనకు చంద్రబాబు కేబినెట్ లో మంత్రి పదవి లభించింది. హేమాహేమీలను పక్కన పెట్టారు. సత్యకుమార్ కు అత్యంత కీలకమైన వైద్య ఆరోగ్య శాఖను అప్పగించారు. కానీ సత్యకుమార్ మాత్రం వైసీపీ స్థానిక నేతలను దగ్గరకు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. టీడీపీ, జనసేన కంటే వైసీపీ నేతలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అక్కడ విమర్శలు బాహాటంగా చేస్తున్నారు. మరోవైపు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి ప్రధానమైన వారిని దూరం చేయడానికే సత్యకుమార్ వైసీపీ వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వ సమయంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డికి అనుకూలంగా వ్యవహరించిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను ధర్మవరానికి సత్యకుమార్

తీసుకురావడంపై టీడీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. టీడీపీ కేంద్ర కార్యాలయానికి కూడా పెద్దయెత్తున ఫిర్యాదులు అందాయి. తమను వేధించిన కమిషనర్ ను సత్యకుమార్ కావాలనే మున్సిపల్ కమిషనర్ గా తీసుకు వచ్చారంటూ టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. మరోవైపు పరిటాల శ్రీరామ్ కూడా సత్య కుమార్ వ్యవహారశైలిపై అసంతృప్తిగా ఉన్నారని తెలిసింది. ఆయన బహిరంగంగా బయట పడకపోయినా, ఆయన వర్గీయులు మాత్రం రోడ్ల మీదకు వచ్చి ఆందోళనకు దిగడం ఇప్పుడు ధర్మవరంలో టీడీపీకి ఇబ్బందిగా మారింది. దీనిపై సత్యకుమార్ తో చర్చించి సమస్యను పరిష్కరించాలన్న నిర్ణయానికి చంద్రబాబు వచ్చినట్లు తెలిసింది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## శ్రీశైలంలో దసరా మహోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ

శ్రీశూలం,శ్రీశైలంలో భక్తుల రద్దీ పెరిగింది దసరా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు కావడంతో మల్లన్న క్షేత్రం భక్తులతో కళ కళలడుతుంది ఉదయం నుండి ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది వరుస సెలవు కూడా ఉండటంతో అనూహ్యంగా రద్దీ పెరిగింది భక్తుల వేకువజామున నుండే పవిత్ర పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించి ఆలయ క్యూలైన్స్ లో క్యూ కంపార్ట్మెంట్ లలో బారులు తీరారు దీనితో శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి అమ్మవారి దర్శనానికి సుమారు 3 నుండి 4 గంటల సమయం పడుతుంది మరోపక్క దసరా నవరాత్రులు కూడా ఉండటంతో భక్తులు శ్రీస్వామివారికి రుద్రాభిషేకం అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారు భక్తుల రద్దీతో అధికంగా ఉండటంతో క్యూ లైన్స్,కంపార్ట్మెంట్ లలో అల్పాహారం, పాలు,బిస్కెట్లు మంచి నీరు ఎప్పటికప్పుడు అందజేస్తున్నారు దసరా మహోత్సవాల నేపద్యంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని ఆలయ ఈవో పెద్దిరాజు అధికారులు భావిస్తున్నారు అలానే సాయంత్రం దసరా మహోత్సవాల మూడోవరోజు కావడంతో సాయంత్రం భ్రమరాంబికాదేవి అమ్మవారు చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

# ఇలా అయితే ఎలా.?

## వైసీపీ కేడర్ అంతర్మథనం

కడప, అక్టోబరు 5, వైసీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై దృష్టి పెట్టకపోవడంపై పార్టీలో నేతల మధ్య చర్చ జరుగుతుంది. ఓటమి తర్వాత నేతలు ఓపెన్ అయిపోతున్నారు. జగన్ ఇలాగే వ్యవహారశైలి కొనసాగిస్తే పార్టీ ఎదగడం కష్టమేనని అంటున్నారు. ఎన్నికల వేళ తీసుకున్న నిర్ణయాలను వెనక్కు తీసుకుని ఇప్పటికైనా నేతలకు పట్టున్న నియోజకవర్గాల్లో వారిని ఇన్‌ఛార్జులుగా నియమిస్తే క్యాడర్ ను కాపాడుకుంటారని చెబుతున్నారు. కానీ జగన్ కు మాత్రం ఇగో అడ్డం వస్తున్నట్లుంది. అందుకే ఆయన నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల నియామకంపై ఎలాంటి నియామకాలు చేపట్టలేకపోతున్నారు. జిల్లా అధ్యక్షులను మాత్రమే నియమిస్తూ మళ్లీ నేతలపై పెత్తనానికి కొందరిని వదులుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలను అనేక మందిని నియోజకవర్గాలను బదిలీ చేశారు. ఒకరి నియోజకవర్గాలకు వేరే వారిని అప్పగిస్తూ టిక్కెట్లను కేటాయించారు. కానీ మొన్నటి ఎన్నికల్లో జగన్ వ్యూహం బెడిసి కొట్టింది. కేవలం పదకొండు నియోజకవర్గాల్లో మాత్రమే వైసీపీ విజయం సాధించింది. ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చినా ఫలితం లేదు. వారిపై వ్యతిరేకత ఉందని మార్చారనుకున్నారు కానీ, తన ప్రభుత్వంపై ప్రజల్లో ఇంతటి వ్యతిరేకత ఉందని ఊహించ లేకపోయారు. అంచనా ఊహకు కూడా అందకపోవడంతోనే జగన్ అలాంటి నిర్ణయం తీసుకున్నారు. అంతా ఐప్యాక్ టీం చెప్పినట్లే చేశానంటూ చేతులు దులిపేసుకున్నారు. దీంతో అయిష?టంగానే ఆ నియోజకవర్గాలకు వెళ్లిన నేతలకు ఓటమి ఎదురు కావడంతో అక్కడ పార్టీని పట్టించుకోవడం మానేశారు. పాత వారు కూడా వదిలేశారు. దీంతో ఆ నియోజకవర్గాల్లో క్యాడర్ అనాథలుగా మారిపోయారు. నేతలు లేక క్యాడర్ కూడా చెల్లాచెదురు కాకముందే అక్కడ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులను నియమించాల్సిన అవసరం ఉందన్నది పార్టీ నేతల అభిప్రాయం. పాత వారికే తిరిగి అవకాశమిస్తే వారు తిరిగి ఆ నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేస్తారంటున్నారు. కానీ జగన్ మాత్రం పార్టీని పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో ఆ నియోజకవర్గాల్లో నేతలు లేకపోవడంతో క్యాడర్ ను కూటమి ఎమ్మెల్యేలు లాగేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో వైఎస్ జగన్ ఇలా చేతులు ముడుచుకుని కూర్చుంటే రేపు స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీస పోటీ ఇచ్చేందుకు కూడా అవకాశముండదన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఇప్పటికీ వైసీపీని అభిమానించే క్యాడర్ అనేక మంది ఉన్నప్పటికీ వారికి అండగా నిలిచే నేత లేక డీలా పడిపోయింది. మరోవైపు అధికారంలో ఉన్నపార్టీ హామీలను అమలుపర్చకపోవడంతో ప్రజల్లో కొంత అసంతృప్తి బయలుదేరింది. దానిని క్యాష్ చేసుకునేందుకు లీడర్లు అవసరం. కానీ జగన్ ఇలా కాలయాపన చేస్తూ వెళితే పార్టీ చేతుల్లో నుంచి చేజారిపోతుందన్న ఆందోళన నేతల్లో కనిపిస్తుంది కాని జగన్ లో మాత్రం వీసమెత్తు కనిపించడం లేదని, తిరిగి తనవల్లనే పార్టీ పుంజుకుంటుందన్న ధోరణిలో ఉన్నారంటున్నారు నేతలు. మరి జగన్ తీసుకునే నిర్ణయంపైనే పార్టీ ఆధారపడి ఉంటుందన్నది పార్టీ బలంగా వినిపిస్తున్న టాక్.

# ఇక్కడ ఎదురు చూపులేనా

విజయనగరం, అక్టోబరు 5, విజయనగరంలో జిల్లాలో ఈ అసెంబ్లీ వైసీపీ చిత్తుగా ఓడిపోయింది. కానీ అక్కడ పార్టీ మాత్రం బలంగానే ఉంది. నేతల మధ్య ఆధిపత్య పోరుతో కేడర్ అయోమయం కారణంగా చాలామంది బయటకు వచ్చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ముఖ్యంగా విజయనగరం మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిని తట్టుకోలేక చాలామంది వైసీపీ నేతలు రాంరాం చెప్పేశారు. తమకు అండగా ఉంటారనుకున్న మాజీమంత్రి బొత్స, జెడ్పీ చైర్మన్ చిన్న శ్రీను వంటి నేతలు కూడా విజయనగరం నియోజకవర్గ రాజకీయాల్లో వేలు పెట్టే సాహసం చేయలేకపోయారు. తమ అనుచరులకు భరోసా ఇవ్వలేకపోవడంతో సీనియర్లయిన పిల్లా విజయకుమార్ వంటి నేతలు వైసీపీని వీడి టీడీపీలో చేరిపోయారు. వైసీపీ స్థాపించిన మొదట్లో తొలి సభ్యత్వం తీసుకుని జిల్లాలో మొదటిసారి జెండా ఎగరేసిన వారిలో అవనాపు విక్రమ్, విజయ్ సోదరులు ఉండేవాళ్లు. అయితే కొన్ని రాజకీయ కారణాలతో వాళ్లిద్దరూ వైసీపీని వీడి చెరోదారి చూసుకున్నారు. ఒకరు జనసేన, మరొకరు టీడీపీలో చేరిపోయారు. అవనాపు ఫ్యామిలీతో పాటు పలువురు విజయనగరం నేతలు ఆ తర్వాత వైసీపీని వదిలారు. అవనాపు సూరిబాబు మరణంత తర్వాత మాజీమంత్రి పెన్మత్స సాంబశివరావు అడుగు జాడల్లో నడుస్తూ ఎమ్మెల్యే టికెట్‌కు ప్రయత్నించారు అవనాపు విక్రమ్, విజయ్. అదే టైంలో కోలగట్ల కాంగ్రెస్‌ను వదిలి వైసీపీలోకి వచ్చారు. 2014 ఎన్నికల్లో ఆయనకు టికెట్ దక్కడంతో అవనాపు బ్రదర్స్ అవమానంగా ఫీలయ్యారు. 2019లోనూ సేమ్ సీన్ రిపీట్. దీంతో వైసీపీలో ఎంత పనిచేసినా తమకు గుర్తింపు లేదని.. కోలగట్ల కారణంగా తమను పక్కన పెడుతున్నారన్న భావన కలిగింది. మాజీమంత్రి బొత్సకు అనుచరుల్లా మసులుకున్నా.. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఈ సోదరులకు కోలుకోలేని దెబ్బ వేశాయి. కనీసం కార్పొరేటర్లుగా పోటీ చేసేందుకు కూడా వీరికి అవకాశం దక్కలేదు. అప్పట్లో ఉత్తరాంధ్ర వైసీపీ కోఆర్డినేటర్‌గా ఉన్న విజయసాయిరెడ్డి ముందు ఇదే విషయాన్ని బోరున వెళ్లగక్కినా ఫలితం లేకుండా పోయింది. దీంతో కోలగట్ల, అవనాపు బ్రదర్స్ మధ్య గ్యాప్ బాగా దూరమైంది. ఇలాను ఉంటే కుదరదని ఆ సోదరులు చెరోదారి వెతుక్కున్నారు. ఎన్నికల ముందు టీడీపీలో చేరిపోయారువిక్రమ్ కుటుంబం జనసేన పార్టీకి దగ్గరైంది. విజయ్ ఫ్యామిలీ టీడీపీలో చేరింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ఏర్పడటంతో వీళ్లిద్దరూ ఒకే గూటికింద పనిచేసే చాన్స్ మళ్లీ వచ్చింది. 14 ఏళ్లు వైసీపీకి అండగా ఉంటూ.. ఆర్థికంగా కూడా సహాయ సహకారాలిచ్చిన తమను అధినేత జగన్ మోసం చేశారన్న భావనలో వీరిద్దరూ పార్టీలు మారినా.. ఇప్పటి వరకు అనుకున్న స్థాయిలో రాజకీయంగా ఎదగలేకపోయారు. జిల్లాలో మంచి పట్టున్న అవనాపు ఫ్యామిలీ రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బలంగానే ఉంది. అయితే ప్రస్తుతం జనసేనలో కూడా వారికి ఇలాంటి ఆధిపత్య పోరే ఎదురవుతోంది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలవలస యశస్వి, గురాన అయ్యలు వంటి నేతలు ముందు వరసలో ఉన్నారు. దీంతో అవనాపు విక్రమ్ దంపతులకు మరోసారి గడ్డుకాలం ఎదురైంది. టీడీపీలో కొనసాగుతున్న అవనాపు విజయ్ కూడా ఎమ్మెల్యే అదితి గజపతిరాజును నమ్ముకొనే అడుగులు వేస్తున్నారు. భవిష్యత్ లో రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలైన తమ రాజకీయ భవిష్యత్తుకు మంచి బాటలు వేస్తాయని గంపెడాశాలతో ఉన్నారు. మొత్తానికి వేర్వేరు పార్టీలైనా.. ఇద్దరు సోదరులు ఒకే కూటమి గూటికి చేరుకోవడం కొంత రిలీఫ్. మరి భవిష్యత్ లో వీరికి ఎలాంటి చాన్స్‌లు వస్తాయో వెయిట్ అండ్ సీ..

# చైర్మన్ పై కోర్టు బాణం...

విజయవాడ, అక్టోబరు 5, ఆ ముగ్గురు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు.. కానీ ఆయన ఆమోదించలేదు. వీళ్లు వెయిట్ చేస్తున్నారు.. కానీ ఆయన నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేదు. వీళ్ల కళ్లు కాయలు కాస్తున్నాయి. వెనక చాలా మంది క్యూలో ఉన్నట్లున్నారు. కానీ.. ఆయన మాత్రం.. ఊహూ? అస్సలు తగ్గనంటున్నారు. ఇదంతా ఎక్కడనేగా.. ఏపీలో వైసీపీ ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారం. ఇలా కాదని.. అవసరమైతే న్యాయపోరాటం చేసైనా తమ రాజీనామాల్ని ఆమోదించుకోవాలనేది ఆ ముగ్గురు ఎమ్మెల్సీల ప్లాన్.. మరి అది వర్కవుట్ అవుతుందా??ఏపీలో టిట్ ఫర్ టాట్ పాలిటిక్స్ బాగానే నడుస్తున్నాయి. ప్రస్తుతం ఏపీ శాసనమండలిలో వైసీపీ 38 మంది ఎమ్మెల్సీల సంఖ్యాబలం ఉంది. శాసనసభలో 11 మందికే పరిమితమైనా.. మండలిలో మాత్రం వైసీపీదే ఆధిపత్యం. దీంతో ఏ బిల్లు పాస్ కావాలన్నా శాసనమండలిలో వైసీపీ సభ్యులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సిన పరిస్థితి. వైసీపీ అధినేత జగన్ ఓడిన కొత్తలో ఎమ్మెల్సీలను చూసి మీరే నా బలం.. నా బలగం.. నాఆశ అన్నారు. కానీ.. పార్టీలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఎవరి వెర్షన్లో వాళు ఆలోచిస్తూ ఉన్నారు. ఎమ్మెల్సీలను పిల్లల కోడిలా రెక్కల కింద దాచుకుందామనుకున్న జగన్‌కు కూటమి నుంచి ఆపరేషన్ ఆకర్ష్ మొదలైంది. అలా ముగ్గురు ఎమ్మెల్సీలు వైసీపీ గూడు వీడి బయటకొచ్చేశారు. వైసీపీకి చెందిన పోతుల సునీత, కర్రి పద్మశ్రీ, బల్లి కల్యాణ్ చక్రవర్తి తమ పదవులకు రాజీనామా చేశారు. అయితే రాజీనామాల్ని ఆమోదించాల్సినది శాసనమండలి చైర్మన్. ఇక్కడే వారికి చిక్కొచ్చి పడింది. మండలి చైర్మన్‌గా వైసీపీ అధినేత జగన్ వీర విధేయుడు కొయ్యే మోషేన్ రాజు ఉన్నారు. ఇద్దరు ఎమ్మెల్సీలు నేరుగా మోషేన్ రాజునే కలిసి రాజీనామాలు సమర్పించారు. రెండు నెలలుగా చైర్మన్ ఆఫీసు నుంచి రాజీనామాలు ఆమోదం పొందినట్లు ఎలాంటి ప్రకటన లేదు. ఆ సీట్లు ఖాళీ అయ్యాయంటేనే కేంద్ర ఎన్నికల సంఘం ఎలక్షన్ నిర్వహిస్తుంది. అప్పుడు టీడీపీకి చెందిన ఆశావహులకు మ్మెల్సీలుగా చాన్స్ దక్కుతుంది. అలా మెల్లగా వైసీపీ బలాన్ని మండలిలో తగ్గిద్దామనుకున్న కూటమి స్కెచ్‌కు వైసీపీ నేత, మండలి చైర్మన్ బ్రేక్ వేసినట్లయ్యింది. రాజీనామాలను ఆమోదించిఉంటే ఇప్పటికే మండలిలో సగం వైసీపీ సభ్యులు ఖాళీ అయ్యేవారని అంటున్నారు. ఏపీలో మండలి, ఎమ్మెల్సీల రాజీనామాల వ్యవహారం చూస్తే.. తెలంగాణలో అసెంబ్లీ స్పీకర్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేల రిసిగ్నేషన్లే గుర్తుకొస్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి వెళ్లిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అయితే బీఆర్ఎస్ మాత్రం పార్టీ మారిన ఎమ్మెల్యేల రాజీనామాలు ఆమోదించి.. అనర్హులుగా ప్రకటించాలని తెలంగాణ స్పీకర్‌ను విన్నవించారు. కానీ అక్కడా ఎలాంటి స్పందనా లేదు. దీంతో కోర్టుకెక్కింది బీఆర్ఎస్. ఏపీ శాసనమండలి విషయంలో కూడా చైర్మన్ రాజీనామాలు ఆమోదించకుంటే తమకు న్యాయపోరాటమే గతి అని వైసీపీని వీడిన ముగ్గురు ఎమ్మెల్సీలు ఆలోచనలో పడ్డారు. కోర్టు మెట్లెక్కినా స్పీకర్, మండలి చైర్మన్‌లు రాజ్యాంగ బద్ధ వ్యవస్థల అధిపతులుగా ఉన్నారు. వారి విచక్షణపై ఆధారపడే ఆమోదించాలా, లేదా..? అనేది ఉంటుంది. గతంలో ఏపీ స్పీకర్ టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాజీనామా చేసినా అంత త్వరగా ఆమోదం తెలపలేదు. ఒక కీలకమైన సమయంలోనే ఓకే చేశారు. అవసరమనుకుంటే రిజైన్ చేసినవారిని పిలిచి మాట్లాడి, ఒత్తిడి చేసే అధికారం కూడా మండలి చైర్మన్‌కు ఉంటుంది. ఈ ముగ్గురి రాజీనామాల కథ తేలే దాకా.. మిగిలిన వాళ్లు రాజీనామా చేసే పరిస్థితి లేదు. దీన్ని బట్టి చూస్తే.. ఇప్పటికి వైసీపీకి శాసన మండలిలో బలం సేఫ్‌గా ఉన్నట్లేనని గుసగుసలు వినిపిస్తున్నాయి.

# సీఐడీకి జెత్వానీ కేసు

విజయవాడ, అక్టోబరు 5, ఏపీలో వివాదంగా మారిన ఓ హీరోయిన్ కేసు ఇప్పుడు చేతికి వెళ్లబోతుందట. ఇప్పటికే బెయిల్ కోసం ఫైట్ చేస్తున్న ఆ ఆఫీసర్లకు..సీఐడీ గుబులు వెంటాడుతోందట. ఆ నటి కేసులో కొత్త కొత్త ట్విస్ట్‌లు ఉంటాయా.? ఇంకొందరు ఐపీఎస్ ఆఫీసర్స్ మెడకు చుట్టుకోబోతోందా.? పవర్‌లో ఉన్నప్పుడు ఏం చేసినా నడుస్తుంది. అనుకున్నోడి మీద కేసు పెట్టొచ్చు. తప్పు చేయనోన్ని కూడా ఇరకాటంలో పడేయొచ్చు. పర్మిషన్లు, చట్టాలు ఇవేవి అడ్డురావు. అందుకే అధికారం ఇచ్చే కిక్కే వేరు. అలాగని సమయం కలసి రాకపోతే అరాచకానికి మూల్యం చెల్లించుకోక కూడా తప్పదు. పవర్ చేతిలో ఉన్నప్పుడు ఏది పడితే అది చేశారు. ప్రభుత్వం మారింది. పాపాల చిట్ట బయటపడుతుంది. ఒకటా రెండా..స్యాండ్, మైన్, వైన్..చెప్పుకుంటూ పోతే పెద్ద కథే ఉంది. అంతేకాదు ఓ హీరోయిన్ కేసు కూడా కొందరు అధికారుల మెడకు చుట్టుకుంది. రేపోమాపో ముంబై నటి జత్వానీ కేసును సీఐడీకి ఇవ్వబోతున్నారట. దీంతో ఉన్న హెడెక్ చాలదని..ఇప్పుడు కొత్త లొల్లి వచ్చిపడబోతుందని పిసుక్కుంటున్నారట ఆ అధికారులు. మాకేం తెలియదని వాళ్లు.. మీ వెనక ఉన్నదెవరో చెప్పాలని పోలీసులు దీంతో రోజురోజుకు కేసు జఠిలం అవుతుంది. ప్రస్తుత పరిస్థితి చూస్తే హీరోయిన్ కేసులో ఆ అధికారులకు ముప్పుతిప్పలు తప్పేలా లేవు. ముంబై నటి జెత్వానీ కేసు దర్యాప్తును సీఐడీకి ఇస్తూ రేపోమాపో ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందంటున్నాయి ప్రభుత్వం వర్గాలు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు సీనియర్ ఐపీఎస్ పిఎస్సార్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్ గున్ని సస్పెండ్ అయ్యారు. మరికొందరు పోలీసు అధికారులపై ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే నలుగురు పోలీసులతో పాటు సీనియర్ ఐపీఎస్ అధికారులు, మరో న్యాయవాది బెయిల్ కోసం హైకోర్టుకెళ్లారు. అయితే ఇంకో సీనియర్ ఐపీఎస్ అధికారి పాత్ర ఉందన్న ఆరోపణలతో ఈ కేసును సీఐడీ కి అప్పగించేందుకు సర్కార్ కసరత్తులు చేస్తోంది. ముగ్గురు అధికారుల సస్పెన్షన్, వారి మీద నమోదైన కేసులు ఒక ఎత్తు అయితే.. ఇప్పుడు ఈ ఎపిసోడ్‌లోకి మరో కొత్త కేరక్టర్ ఎంటరైందని అంటున్నారు. సీనియర్ ఐపీఎస్ ల మీద దర్యాప్తు జరుగుతున్న క్రమంలో మాజీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి పేరు కూడా తెరపైకి రావడం సంచలనం అవుతోంది. జెత్వానీ కేసులో నేరుగా నాటి డీజీపీ పేరు లేకున్నా.. పరోక్షంగా ఆయన వ్యవహారశైలిపైనే అధికార వర్గాల్లో చర్చ జరుగుతోందట. డీజీపీగా, స్టేట్ పోలీస్ బాస్‌గా ఈ కేసు విషయంలో ఏం జరుగుతోందో తెలిసి కూడా రాజేంద్రనాథ్ రెడ్డి ఆపలేదని ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఎంక్వైరీ స్టార్ట్ అయితే..మాజీ డీజీపీ

రాజేంద్ర నాథ్‌రెడ్డికి నోటీసులు ఇస్తారని పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఇన్‌సైడ్ టాక్ వినిపిస్తోంది. అంతేకాదు ఈ కేసులో సస్పెండ్ అయిన ఐపీఎస్ ఆఫీసర్లు పిఎస్సార్ ఆంజనే యులు, కాంతి రాణా, విశాల్ గున్నిలపై గతంలో ఏమైనా ఆరోపణలు ఉన్నాయా..? అనే కోణంలో కూడా ప్రభుత్వ పెద్దలు ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. అందరికంటే ఎక్కువగా పిఎస్సార్ ఆంజనేయులు మెడకు ఒఖఖూఅలో జరిగిన వ్యవహారాలు చుట్టుకోబోతున్నట్టు టాక్. గ్రూప్స్ పరీక్షల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు.. వాల్యూయేషన్‌లో రకరకాల పద్ధతులను ఫాలో అయ్యారనే అభియోగాలను తెరమీదకు వస్తున్నట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించి మరింత సమాచారం సేకరించడంతో పాటు.. అవసరమైన సాక్ష్యాలను కూడా సిద్ధం చేస్తున్నట్టు చెప్పుకుంటున్నాయి రాష్ట్ర పోలీస్ వర్గాలు. ఇదే జరిగితే పిఎస్సార్ మరిన్ని కేసుల్లో ఇరుక్కోవడం ఖాయమని అంటున్నారు. ఇలా జెత్వానీ కేసు కొత్త పుంతలు తొక్కబోతోంది. ముందు ముందు ఇంకెన్ని ట్విస్ట్‌లు ఉంటాయో, ఏయే మలుపులు తిరుగుతాయోనన్న ఉత్కంఠ పెరుగుతోంది.

# తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

## ఆకట్టుకుంటున్న కళాబృదందాల ప్రదర్శనలు

తిరుమల,అక్టోబర్5: తిరుబమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. వరుసగా రెండోరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇకపోతే బ్రహ్మోత్సవాల్లో కళాబృందాల ఆటపాటలు వర్ణనాతీతం. మాడవీధుల్లో వారు స్వామి ఊరేగింపు ముందు చేసే విన్యాసాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. మొదటి రోజైన శుక్రవారం రాత్రి పెద్ద శేష వాహన సేవలో టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన కళా బృందాల ప్రదర్శనలు భక్తులకు ఆధ్యాత్మికానందం కలిగించాయి. వివిధ ప్రాంతాలకు చెందిన 14 కళాబృందాలలో 410 మంది కళాకారులు ప్రదర్శనలిచ్చారు. ఒరిస్సాకు చెందిన ఒడిస్సీ నృత్యం, తమిళనాడుకు చెందిన లతారవి ఆధ్వర్యంలో మయూర నృత్యం, కేరళ రాష్ట్రానికి చెందిన వీణ బృందం యక్షగానం, కర్నాటక కళా రూపమైన వీరగాశను చేతన్ బృందం అద్భుతంగా ప్రదర్శించారు. శ్రీకాకుళం నుండి శ్రీమతి దుర్గా భవానీ, తిరుమల నుండి శ్రీనివాసులు, రాజమండ్రి నుండి శ్రీసురేష్ బాబు, తిరుపతి బాలమందిర్ విద్యార్థులు కోలాటాలతో మంత్ర ముగ్ధులను చేశారు. హైదరాబాదుకు చెందిన శ్రీమతి లక్ష్మీదేవి బృందం ఒగ్గుడోలుతోను, తిరుపతికి చెందిన డాక్టర్ మురళీకృష్ణ బృందం మోహినీయట్టంతోను, కర్నాటకకు చెందిన శ్రీమతి వనీష బృందం పటకునిత కళా విన్యాసం, శ్రీ రవికుమార్ చిలిపిలి గొంబె నృత్యం, శ్రీ నాగేంద్ర బృందం కంసాలి రూపకంతో తమ అద్భుతమైన ప్రదర్శనలతో భక్తులకు నయనానందాన్ని కలిగించారు. ఇదిలావుంటే తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణంతో సాలకట్ల బ్రహ్మోత్సవాలకు వైభవంగా నాంది పలికారు. తొలిరోజు రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామి పెద్దశేష వాహనంలో నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అంతకుముందు ఆలయంలో నిత్యపూజాదికాల అనంతరం ప్రధాన అర్చకులు వరుసగా శ్రీదేవి, భూదేవి, మలయప్ప, ఇతర దేవతలు, కంకణ భట్టాచార్యులైన గోవిందాచార్యులు, టీటీడీ ఈవో శ్యామలరావుకు కంకణ ధారణ చేశారు. మధ్యాహ్నం 3గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని బంగారు తిరుచ్చిలో మాడవీధుల్లో ఊరేగించారు. ధ్వజపటాన్ని కూడా ఊరేగిస్తూ బ్రహ్మోత్సవాలకు దేవతలందరికీ ఆహ్వానం పలికారు. సాయంత్రం 5.45–6గంటల మధ్య మీనలగ్నంలో ధ్వజారోహణ నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీవారికి సిఎం చంద్రబాబు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు.

# ప్రజా సమస్యలను వదిలేసి లడ్డూపై దుష్ప్రచారం

కాకినాడ,వైసిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కన్నబాబు మీడియా తో మాట్లాడారు. కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి ని రాజకీయాల్లోకి టిడిపి లాగింది. టిడిపి దేవుడిని కూడా వదలడంలేదు. జరిగిన సంఘటన ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగితే అది గత ప్రభుత్వానికి అంటకడుతున్నారని అన్నారు. తాము ఇచ్చిన నివేదికను పూర్తిగా నమ్మవద్దని ఎన్డీడీబీ చెప్పింది. శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి కలవలేదని ఈవో చెబుతున్నా టిడిపి ఇంకా దుష్ప్రచారం చేస్తుంది. వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన వారిని పట్టించుకోలేదు. ఇసుక తీవ్ర కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులకు పని లేకుండా పోయింది. విశాఖ ఉక్కు ను ప్రైవేటు పరం చేసేందుకు అడుగులు పడుతున్నాయి. మహిళలు స్వేచ్ఛగా రోడ్ పై తిరిగే పరిస్థితి లేదు. ఏడు సంవత్సరాల ముస్లిం బాలిక శవమై తేలితే ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదు. మెడికల్ సీట్లు తగ్గిపోయాయి. ఆర్బీకే లను మూతపడే స్థితికి తీసుకువచ్చారని అన్నారు. ఇది మంచి ప్రభుత్వం అని మీరు బాజా కొట్టుకోవడం కాదు ప్రజలు చెప్పాలి. ఉల్లిపాయలు ధరలు విపరీతంగా పెరిగిపోయింది. బియ్యం,వంట నూనెలు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రజాసమస్యలను పక్కదారి పట్టించడానికి లడ్డూపై దుష్ప్రచారం చేస్తున్నారు. కాకినాడ లో గతంలో ట్రక్కు ఇసుక 16 వేలు ఉంటే ఇప్పుడు 30 వేలు తీసుకుంటున్నారు.

# ఎస్.ఎన్.పాల్ కు కేటాయించిన భూమిని వెనక్కి తీసుకోవాలి

- ఆ భూమిని విశాఖలోని పాత్రికేయులకు కేటాయించాలి
- కూటమి ప్రభుత్వానికి తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ విజ్ఞప్తి
- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేత
- పులివెందుల ఎమ్మెల్యే వై.ఎస్.జగన్ మానవతా వాది కాదని బి.వి.రామ్ విమర్శ

విశాఖపట్నం, హిందూ వాదినని శారదా పీఠాధిపతిని అంటూ మోసం చేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి కు గత ప్రభుత్వం కేటాయించిన భూమిని.. కూటమి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ విజ్ఞప్తి చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న భూమి ని విశాఖలోని పాత్రికేయులకు కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వంలో ఆన్లైన్ ద్వారా కూడా అప్లై చేసుకున్నారు. ఇదే అంశమై శనివారం.. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు బి.వి.రామ్ వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హిందూ మతం పేరుతో ప్రజల్ని నమ్మించి మోసం చేస్తున్న నయవంచకుడు ఎస్.ఎన్.పాల్ (స్వరూపానందేంద్ర సరస్వతి) అని రామ్ ఆరోపించారు. అతను గత వైసీపీ ప్రభుత్వానికి తొత్తులా వ్యవహరించారని అన్నారు.

అందుకే రామతీర్థంలో శ్రీరామ విగ్రహానికి శిరచ్ఛేదం జరిగినా కనీసం స్పందించలేదని ప్రస్తావించారు. ఈ క్రమంలోనే వైయస్ జగన్ సర్కారు ఎస్.ఎన్.పాల్ కు భీమిలిలో 15 ఎకరాల భూమిని ధార దత్తం చేసిందని పేర్కొన్నారు. తాజాగా తిరుపతిలో లడ్డు అపవిత్రమైందని వార్తలు వినవస్తున్న నేపథ్యంలో కూడా కనీసం ఆయన స్పందించలేకపోయారన్నారు. అందుకే ఈ విషయంలో స్పందించాలని, అసలు హిందువో కాదో స్పష్టం చేయాలని తాను 48 గంటల గడువు ఇచ్చినా హిందుత్వాన్ని నిరూపించ లేకపోయారన్నారు. ఈ క్రమంలోనే స్వరూపానందేంద్ర సరస్వతి హిందువు కాదని భావిస్తూ అతని పేరును ఎస్.ఎన్.పాల్ గా మార్చివేశానని పేర్కొన్నారు. ఏది ఏమైనా అతనికి భీమిలి లో కేటాయించిన 15 ఎకరాల భూమిని కూటమి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాల్సి ఉందన్నారు. జగన్ మానవతా వాది కాదుపులివెందుల ఎమ్మెల్యే వైయస్ జగన్మోహన్ రెడ్డి తను మానవతా వాదినని చెపుతుండడాన్ని బీవీ రామ్ తప్పు పట్టారు. జగన్ నిజంగా మానవతా వాది అయితే..మణిపూర్ మారణ హోమంలో పెద్ద సంఖ్యలో క్రిస్టియన్స్ బాధితులుగా మారినప్పుడు జగన్ మానవత్వం ఏమైందని ప్రశ్నించారు. వైయస్ జగన్ సోదరి షర్మిల చెబుతున్న విధంగా ఆయన క్రిస్టియన్ అయినప్పటికీ మణిపూర్ అంశంలో స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. మరో వైపు చెల్లెలు సునీతను ఎందుకు క్షోభ పెడుతున్నారని, సొంత బాబాయ్ వివేకానంద హత్య కేసు లో దోషులను.. ఐదేళ్లపాటు అధికారంలో ఉండి కూడా ఎందుకు గుర్తించ లేకపోయారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కలిసిన వారులో టిడిపి 8 వ వార్డ్ అధ్యక్షుడు సిహెచ్.గోపి తదితరులు పాల్గొన్నారు.

# దొంగలు నీతులు చెబుతున్నారు

విశాఖపట్నం,జగన్ ఇంట్లో ఒక మతం, బయట మరో మతం.. ఈ తమాషాలేంటో అని కేంద్ర మాజీ మంత్రి, తెదేపా సీనియర్ నేత పూసపాటి అశోక్ గజపతిరాజు విమర్శించారు. విశాఖలో ఆయన మీడియాతో మట్లాడుతూ.. జగన్ హిందూ ఆచారాలు, ధర్మాన్ని పాటించరు. దొంగలు నీతులు చెబుతుంటే.. వినడానికి కష్టంగా ఉందని,హిందూ ధర్మ రక్షణకు ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. తిరుమల కల్తీ నెయ్యి అంశంలో ఎవరికైనా సరే శిక్ష పడాల్సిందే అని చెప్పారు. గత ప్రభుత్వ విధానాలతో ప్రసాదాల్లో నాణ్యత లోపించిందని,వైసీపీ హయాంలో 200పైగా ఆలయాల పై దాడులు జరిగాయని,ఆలయాలపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోలేదని అన్నారు.

# ఘనంగా గడ్డం వెంకట్ స్వామి ( కాక) 95 వ జయంతి వేడుకలు

## మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇంగిలే రామారావు..

జమ్మికుంట, పెద్దపల్లి మాజీ పార్లమెంటు సభ్యులు పేదలకు కార్మికులకు మెరుగైన జీవన సదుపాయాలను కల్పించడం కోసం విశేష కృషి చేసిన మాజీ కేంద్ర మంత్రి కటస్వామి, 95వ, జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు . ఈ సందర్భంగా ఇల్లంధకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు రామారావు, మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో కార్మికులకు వారి కుటుంబాలకు పెన్షన్ స్కీం అమలయ్యేలా చేసిన ఆధ్యుడు,కాకా, అని ,పేదల కోసం నిగ్గదీసి అడగడంలో నిజం మాట్లాడడంలో,,కాక,,వెనుకడుగు వేసిన రోజు లేదని ,అంబేద్కర్ ఆశయాల కోసం చివరి శ్వాస వరకు పనిచేసిన మహానీయుడు అని, రాజకీయ భీష్ముడు కార్మిక బాంధవుడు అని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోడిశాల పరమేష్, పైడిపల్లి దేవేందర్, గుండ్ల వెంకన్న ,రాజేందర్, సింగిరెడ్డి గోపాల్ రెడ్డి, పెద్ది కుమార్ , రాజబాబు, కొమురయ్య, రాజయ్య ,యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

మచిలీపట్నం,శక్తి పటాల ప్రదర్శనలో ఎటువంటి అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని మచిలీపట్నం డీఎస్పీ అబ్దుల్ సుభాన్ హెచ్చరించారు. ఈ నెల 2 వ తేదీన బలరాముని పేటలో చోటు చేసుకున్న ఇరువర్గాల ఘర్షణ కేసులో 17 మందిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపామన్నారు. వీరిలో అత్యధిక మంది గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ బీటెక్ విద్యార్థులు ఉన్నారన్నారు. విద్యార్థులు రాగద్వేషాలకు పోయి ఇటువంటి కేసుల్లో చిక్కుకోవడం బాధాకరమన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారు ఎవరైనా చూస్తూ ఊరుకోమని అయన హెచ్చరించారు...

## అగ్రికల్చర్ విధ్యార్థులు కి ఇంటర్నిప్ ట్రైనింగ్...

చదువు పాఠాలు నేర్పిస్తుంది కానీ వొకేషనల్ మాత్రం జీవిత పాఠాలు నేర్పిస్తుంది


: ప్రిన్సిపల్ సంగిప్ప నాగేశ్వర రావు..






నంద్యాల/రుద్రవరం -శ్రీ ప్రస్థానం:-మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు దసరా సెలవుల యందు సమగ్ర శిక్ష వారి సూచనలతో, 07 రోజులు పాటు అగ్రికల్చర్ ట్రైనర్ జ్యోతి ప్రియా ఆధ్వర్యంలో ఇంటర్నెట్ షిప్ వర్క్ చేయడం జరుగుతుందని ప్రిన్సిపల్ సంగీపు నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఈ ట్రైనింగ్ లో భాగంగా జ్యోతి ప్రియా మాట్లాడుతూ శెలవులలో కూడా పిల్లలు అందరూ తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ తమ జ్ఞానాన్ని పెంచుకుంటూ ముందుకు సాగుతున్నారన్నారు. ఆర్.బి.కె కేంద్రాలలో, ఫర్టిలైజర్ షాపులలో అన్ని రకాల మందులు వినియోగం బయోమాస్, నేల గురించి చాలా విషయాలు తెలుసుకున్నారు. అలాగే ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇది ఒక మంచి కార్యక్రమం అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని పిల్లలందరూ సద్వినియోగం చేసుకుంటే మంచి స్కిల్స్ సాధించుకుంటారు అని అన్నారు. జీవితంలో ఎదగాలంటే తప్పనిసరిగా కొన్ని స్కిల్స్ సంపాదించుకోవాలి. అలాంటివి ఈ సెలవులను త్యాగం చేసి, వాళ్లు మంచి జ్ఞానాన్ని పెంపొందించుకున్నారని అన్నారు. ఆర్ బి కె సెంటర్ ఏఓ కు వారి సిబ్బందికి, ఫర్టిలైజర్స్ యాజమాన్యానికి,వారి సిబ్బందికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

## సంతాన లక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారు.




నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల కేంద్రంలోని స్థానిక అమ్మవారి శాలలో దసరా శరన్నవరాత్రులలో భాగంగా మూడవరోజు సంతాన లక్ష్మిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం ఆర్యవైశ్య సంఘ సభ్యులు సంతాన లక్ష్మిగా దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకుని అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తాదులందరికీ ఆలయ పండితులు అయినటువంటి విశ్వనాథ శర్మ శటగోపార్చనలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## 18 మద్యం సీసాలు స్వాధీనం.

ఎస్సై వరప్రసాద్.

నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల పరిధిలోని మాచి నేనిపల్లె గ్రామానికి చెందిన వెంకట పుల్లయ్య అనే వ్యక్తి నుంచి 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై యువి వరప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మాచినేని పల్లి గ్రామంలో మద్యం సీసాలు విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. ఇందులో భాగంగా అతని వద్ద నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



# ప్రశాంత వాతావరణంలో సంతోషంగా బన్ని ఉత్సవాన్ని జరుపుకోవాలి...

ఈనెల 12న జరుగు బన్ని ఉత్సవాల సమీక్ష సమావేశంలో...

జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య...

కర్నూలు , అక్టోబర్ 5 :- జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మాల మల్లేశ్వర స్వామి ఉత్సవాల లో భాగంగా ఈనెల 12 వ తారీకున జరగనున్న బన్నీ ఉత్సవానికి ఏర్పాట్లు పై జరిగిన సమీక్ష సమావేశంలో కమిటీ సభ్యులను , గ్రామస్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ , ప్రశాంతంగా , సంతోషంగా ఉత్సవాలు జరగాలని అందుకు కమిటీ సభ్యులు అన్ని గ్రామాలను సందర్శించి హింసాత్మక ఉత్సవాలను విడనాడే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి .నవ్య పలు సూచనలు జారీ చేశారు.శుక్రవారం సాయంకాలం దేవరగట్టు లో జరిగిన బన్ని ఉత్సవ సమీక్ష



సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య జిల్లా అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఇందులో భాగంగా రోడ్లు భవనాల శాఖ వారు కొండపైన గుడి దగ్గర బారి కేడింగ్ చేయాలని అలాగే బన్ని ఉత్సవం జరిగే ప్రదేశంలో బారి కేడింగ్ చేయాలని , ఫైర్ సర్వీస్ వారు ఫైర్ ఇంజన్లు మరియు పోర్టబుల్ ఫైర్ ఎక్విప్మెంట్ అందు బాటులో ఉంచుకోవాలని , పంచాయతీరాజ్ శాఖ వారు రోడ్లకు మరమ్మత్తులు , పొదలు తొలగించి సరిచేయు చర్యలు వెంటనే చేయాలని , ఆర్డబ్ల్యూఎస్ వారు త్రాగునీరు ఏర్పాట్లు, డాక్టర్ల కొరకు రెండు బయో టాయిలెట్లు ఏర్పాటు చేయాలని , మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ వారు నాలుగు అంబులెన్సులు , 20 బెడ్ల ఆసుపత్రిని తయారు చేసుకోవాలని , అందుకు అవసరమైన మందులు సమకూర్చుకోవాలని సూచించారు. బన్నీ జరుగు ప్రదేశంలో మరియు కొండపైన అవసరమైన లైటింగ్ ఏర్పాట్లు మరియు పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా పంచాయతి అధికారికి సూచించారు. కర్ణాటక మద్యాన్ని అరికట్టాలని ముందు రోజు మద్యం దుకాణాలు మూసి వేయించాలని ఆదేశించారు. దేవరగట్టు ప్రాంతంలో 100 సీసీ కెమెరాలు , డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని వీటివల్ల హింసాత్మక చర్యలు తగ్గుతాయని తెలియజేశారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ గారి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాలన్నీ శాంతియుత వాతావరణంలో పూర్తయి బన్ని ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.అంతకు ముందు జరిగిన సమావేశంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ బన్నీ ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడతామని,అవసరమైతే కఠిన చర్యలు చేపడతామని తెలియజేశారు. అన్ని గ్రామాల ప్రజలు పోలీసులకు సహకరించి బన్నీ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలాగా కృషి చేయాలని కోరారుఈ సమావేశానికి ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ , జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి , జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ నాగేశ్వరరావు , డి ఎం అండ్ హెచ్ ఓ భాస్కర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దేవరగట్టు బన్ని ఉత్సవం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి...

జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్



కర్నూలు అక్టోబర్ 05? బన్నీ ఉత్సవ పర్యవేక్షణకు 100 సీసీ కెమెరాలు, 5 డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ? ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టభద్రత . ఈ నెల 12 న జరుగబోయే దేవరగట్టు బన్ని ఉత్సవాన్ని ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ అన్నారు. ఈ సంధర్బంగా హోళగుంద మండలం, దేవరగట్టు లో బన్ని ఉత్సవ ఏర్పాట్ల పై శనివారం సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, దేవస్థాన కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూఅక్టోబర్ 12 వ తేది దసర ఉత్సవాలలో దేవరగట్టులో జరిగే శ్రీ మాల మల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవం కు సంబంధించి పటిష్టభద్రత, బందోబస్తు ఏర్పాట్ల పై ఈ రోజు దేవరగట్టు కు రావడం జరిగిందన్నారు. బన్ని ఉత్సవం కార్యక్రమంలో ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరూ గాయపడడం కానీ, ఇబ్బంది పడడం కానీ జరగకుండా ప్రశాంత వాతావరణంలో బన్ని ఉత్సవం జరుపుకోవాలని దేవరగట్టు బన్ని ఉత్సవ భక్తులకు తెలియజేస్తున్నామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గతంలో కంటే ఈ సంవత్సరం ప్రశాంతవాతావరణంలో ఉత్సవం జరిగే విధంగా , చిన్న చిన్న సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. బన్ని ఉత్సవం ప్రశాంతవాతావరణంలో పూర్తి అయ్యే విధంగా పోలీసుయంత్రాంగం తరపున అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు.బన్నీ ఉత్సవ పర్యవేక్షణకు 100 సీసీ కెమెరాలు, 5 డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. బన్ని ఉత్సవం సంధర్బంగా అక్రమ మద్యం సరఫరా , మద్యం అమ్మకాలు జరగకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ , జాయింట్ కలెక్టర్ డా. బి. నవ్య , ఆలూరు ఇంచార్జ్ వీరభద్ర గౌడ్ , పత్తికొండ డిఎస్పి వెంకట్రామయ్య, ట్రైనీ డిఎస్పీ ఉష శ్రీ, సిఐలు ప్రసాధ్, కేశవరెడ్డి, శ్రీనివాస నాయక్, హోళగుంద ఎస్సై బాల నరసింహులు , ఆయా శాఖల జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# జిల్లాలో ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధన లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళిక

ప్రజాభిప్రాయం తో ప్రణాళిక రూపకల్పన

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా






కర్నూలు, అక్టోబర్ 05:- జిల్లాలో ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధన లక్ష్యంగా ఐదేళ్లకు స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికను రూపొందించడం జరుగుతోందని, వివిధ వర్గాల ప్రజల నుండి అభిప్రాయాలను స్వీకరించి ఇందులో పొందుపరచి ప్రభుత్వానికి పంపుతామని క జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో స్వర్ణాంధ్రఏ2047 జిల్లా దార్శనిక ప్రణాళిక (2024-29) రూపకల్పన నిమిత్తం వివిధ వర్గాలు, అసోసియేషన్ లతో సమావేశమై వారి సలహాలు, సూచనలను స్వీకరించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళిక గురించి కలెక్టర్ వివరించారు. 2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తి కానున్న సందర్భంగా అన్ని రంగాల్లో రాష్ట్ర సమగ్రాభివృద్ధి ధ్యేయంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికను రూపొందించడం జరుగుతోందన్నారు.. ఇందులో భాగంగా ఐదేళ్ళ కాలంలో అభివృద్ధి లక్ష్యాలతో గ్రామ,మండల, జిల్లా విజన్ ప్రణాళికలను రూపకల్పన చేస్తున్నామన్నారు.. జిల్లా స్థాయిలో ప్రణాళికల రూపకల్పనకు వివిధ వర్గాల ప్రజలు, అసోసియేషన్ల నుండి సలహాలు స్వీకరించడం జరుగుతోందన్నారు..ప్రధానంగా వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో అభివృద్ధిపై దృష్టి సారించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు..ఈ రంగాలతో పాటు విద్యా, వైద్య రంగాల్లో కూడా అభివృద్ధి సాధించే విధంగా ప్రణాళికను రూపకల్పన చేసి దానిని అమలు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. 2022-23 ధరల్లో కర్నూలు జిల్లా జిడిడిపి 47514 కోట్లతో రాష్ట్రంలో 14వ స్థానంలో ఉందని కలెక్టర్ తెలిపారు.. జీవీఏ కి సంబంధించి జిల్లా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 17447 కోట్లతో 39.11%, సేవా రంగాల్లో 17180 కోట్లతో 38.52%, పారిశ్రామిక రంగంలో 9978 కోట్లతో 22.37%తో ఉందని కలెక్టర్ వివరించారు. వ్యవసాయ రంగంలో 10వ స్థానంలో, సేవా రంగంలో 12వ స్థానంలో, పారిశ్రామిక రంగంలో 13వ స్థానంలో ఉందని తెలిపారు

# అహోబిలంలో ఘనంగా స్వాతి నక్షత్ర వేడుకలు.





ఆళ్లగడ్డ,అక్టోబర్:05, శ్రీ ప్రస్థానం న్యూస్:- నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో శనివారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.ఎగువ దిగువ అహోబిలం క్షేత్రాలలో స్వాతి పర్వదినం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. దసరా సెలవులు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ స్వామి వారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. దిగువ అహోబిలంలోని అద్దాల మంటపంలో స్వాతి సందర్భంగా సుదర్శన హోమం కార్యక్రమాన్ని వేద పండితులు నిర్వహించారు. శ్రీ ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవారి ఉత్సవమూర్తులను మూలవిరాట్ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.పూజలో పాల్గొన్న భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ఈ ప్రభుత్వ తప్పును మాకు అంటగాడుతున్నారు..

టీడీపీపై మాజీ మంత్రి కురసాల సీరియస్

అమరావతి : దేవుడిని కూడా టీడీపీ రాజకీయాల్లోకి లాగిందని మాజీ మంత్రి కురసాల కన్నబాబు విమర్శించారు. ఈ ప్రభుత్వంలో జరిగిన తప్పిదాన్ని గత ప్రభుత్వానికి అంటగడుతున్నారని మండిపడ్డారు. కాకినాడలో కురసాల మీడియాతో మాట్లాడుతూ.. లడ్డూ విషయంలో టీడీపీ దుష్ప్రచారం చేస్తూనే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.భక్తుల మనోభావాలకు టీడీపీ భంగం కలిగించిందని కన్నబాబు అన్నారు. గత ప్రభుత్వంపై బురద జల్లి రాద్ధాంతం చేశారని మండిపడ్డారు. సుప్రీంకోర్టు చివాట్లు పెట్టిన తర్వాత కూడా చంద్రబాబు అండ్ కో కట్టుకథలు ప్రచారం చేస్తూనే ఉన్నారని విమర్శించారు. జగన్‌ను తగ్గిస్తున్నామని అనుకుంటూ.. టీటీడీ విశిష్టతను దెబ్బతీస్తున్నారని ఆయన మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని కన్నబాబు అన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేసేందుకు టీడీపీ కుట్రలు చేస్తుందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్‌లో నాలుగువేల ఉద్యోగులను తొలగిస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసి మంచి ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలపై భారం పడుతుందని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిత్యవసర వస్తువుల ధరలు పెరిగితే.. మార్కెట్ స్థిరీకరణ నిధులతో తక్కువగా ప్రజలకు అందించామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ధరలు ఎక్కడైనా తగ్గించారా అని ప్రశ్నించారు.



## రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ అన్నం సుబ్బయ్య మృతివ్యవసాయం

లోఅన్నం సుబ్బయ్య సేవలు చిరస్మరణీయం

నంద్యాల అక్టోబర్ 5 నంద్యాల కు చెందిన రిటైర్డ్ వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నం సుబ్బయ్య (82) శనివారం ఉదయం మృతి చెందారు. అన్నం సుబ్బయ్యకు ఇద్దరు కుమారులు. ఒకరు ఏవిఆర్ ప్రసాద్. ఈయన లయన్స్ క్లబ్ సేవా సంస్థల ఆంధ్రప్రదేశ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడిగా పనిచేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా రాజకీయాల్లో ప్రముఖ నాయకుడిగా ఉన్నారు. మరొకరు ఏ.లీలా రమేష్ అమెరికాలో సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా స్థిరపడ్డారు. ఒక కుమార్తె జి. పద్మజ ఉన్నారు. వ్యవసాయ శాఖలో ఏవోగా, ఏడిఏ గా, డిప్యూటీ డైరెక్టర్ గా అన్నం సుబ్బయ్య విశిష్ట సేవలు అందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో జిల్లా కేంద్రమైన కర్నూలులో ఏపీ విత్తన ధ్రువీకరణ విభాగంలో అధికారిగా పనిచేశారు. వ్యవసాయ శాఖలో వివిధ హోదాల్లో పని చేసిన అన్నం సుబ్బయ్య నంద్యాల, ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం లోని వివిధ మండలాల పరిధిలో ఉన్న గ్రామాల్లోని రైతులతో మమేకమై తనకంటూ ఒక ప్రత్యేకమైన అనుబంధాన్ని కొనసాగించి లాభసాటి వ్యవసాయంలో మెలకువలను, సలహాలు సూచనలను రైతులకు క్షేత్రస్థాయిలో అందించారు. 1966 నుంచి 35 సంవత్సరాలు వ్యవసాయ శాఖలో వివాద రహితుడిగా, అత్యంత సౌమ్యుడిగా, రైతులతో మమేకమై వివిధ హోదాల్లో పనిచేసిన అన్నం సుబ్బయ్య 2000 సంవత్సరంలో పదవీ విరమణ చేయడం జరిగింది.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757